

ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా జనరంజక పాలన అందించి సింహపురి ప్రజల హృద యాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి జన్నత్‌హుస్సేన్. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ విరమణ పొందిన ఆయన నాలుగేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని తన స్వగృహంలో కన్ను మూశారు. ఆయనకు జిల్లా ప్రజలు అశ్రునివాళులు అర్పించారు.

## జనరంజక పాలకుడు
# జన్నత్ హుస్సేన్

### పూర్వ కలెక్టర్ అస్తమయం
### నాటి సేవలను స్మరించుకున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

**నెల్లూరు (సాంస్కృతికం) :** 1977 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జన్నత్ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వివిధ సందర్భాల్లో ప్రత్యేకాధికారిగా పనిచేశారు. ఆ తర్వాత 1985-87 మధ్య నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. కలెక్టర్ హోదాను పక్కనపెట్టి తన వద్దకు ఎవరు వచ్చినా లేచి నిలబడి అర్జీలు తీసుకునేవారు. ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కరించేవారు. ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చారు. అధికారులను కూడా ఓ మిత్రుడిగా ప్రోత్సహించేవారు. రెవెన్యూ శాఖ ఆయనను ఇప్పటికీ దేవుడిగా భావిస్తున్నట్లు ఆ శాఖ విశ్రాంత అధికారులు చెబుతున్నారు. నెల్లూరు నగరంలో ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేశారు. జన్నత్ హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్ ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. పేదలకు గృహ నిర్మాణాలలో నెల్లూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఆయనకు ప్రభుత్వం అవార్డు, నగదు పురస్కారం అందజేసింది. ఆ నగదును హౌసింగ్ శాఖ సిబ్బందికే పంచిపెట్టారు. నగరంలోని కొత్తూరులో నిరుద్యోగులకు ఇచ్చిన కోళ్లఫారంలో కోళ్లు గంబోరో వ్యాధితో చనిపోయి తీవ్రంగా నష్టపోయారు. కలెక్టర్ హోదాలో జన్నత్ స్వయంగా కోళ్లఫారాలను సందర్శించి నిర్వాహకులకు ధైర్యం చెప్పారు. పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించడమేకాక విద్యార్థులకు దుస్తులు పంచేవారు. ఆయన బదిలీ అయిన తర్వాత జిల్లా చరిత్రలో ఏ కలెక్టర్ చేయని విధంగా ఉమ్మడి జిల్లాలోని 46 మండలాలకు వెళ్లి అక్కడి అధికారులు, సిబ్బందిని పలకరించి వీడ్కోలు తీసుకున్నారు. ఆనాటి సంఘటనలను పలువురు విశ్రాంత అధికారులు స్మరించుకుంటున్నారు.

**● ఎమ్మెల్యే కోటంరెడ్డి నివాళి**



నిరాహారదీక్ష శిబిరం వద్ద కోటంరెడ్డికి నిమ్మరసం ఇస్తున్న అప్పటి కలెక్టర్ జన్నత్

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే టీడీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్నత్ హుస్సేన్ మరణంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో వీఆర్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా 13రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ప్పుడు అప్పటి కలెక్టర్ హోదాలో జన్నత్ హుస్సేన్ దీక్షా శిబిరం వద్దకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, తనకు ఆయన స్వహస్తాలతో నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారని తెలిపారు. ఆయన మరణానికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కన్నీటి నివాళులు అర్పించారు.

**● నిజాయితీకి నిలువుటద్దం : సోమిరెడ్డి**


నిజాయితీకి నిలువుటద్దం జన్నత్ హుస్సేన్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తన మేనమామ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఆయన నెల్లూరు కలెక్టర్‌గా పని చేశారని, తమ పొరుగూరు గుడిపల్లిపాడులో ముస్లిం కాలనీకి ఆయన పేరు పెట్టారని అన్నారు. ఆయన ప్రజలకు అందించిన సేవలు, ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు.

---

- ఎన్నికల వేళ వలంటీర్లకు తాయిలాలు
- మూడు నెలలకు ముందే ప్రోత్సాహకాలు
- నగదు మొత్తం పెంచి ఆకట్టుకునే ప్రయత్నం
- ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించేలా వైసీపీ కుట్రలు

# ‘వందనం’తో వల!

**నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వ తీరుతో అన్ని వర్గాల్లో తీవ్ర అసహనం కనిపిస్తోంది. ఉద్యోగ వర్గాల్లో అయితే పీకల్లోతు కోపం వ్యక్తమవుతోంది. వారికి రావాల్సిన బకాయిలను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించకుండా చెడుగుడు ఆడుతోంది. అదే సమయంలో వలంటీర్లతోనూ గొడ్డు కష్టం చేయించుకుంటూ గౌరవ వేతనం అంటూ వారి జీవితాలతో ఆటలాడుకుంటోంది. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వ్యవస్థ అయినా ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన వలంటీర్లు ఇటీవల ప్రభుత్వంపై తిరగబడటం ప్రారంభించారు. గౌరవ వేతనం పెంచాలంటూ ఉద్యమం చేశారు. అయితే నాడు వారి డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం, ఇప్పుడు ప్రోత్సాహక తాయిళాలతో వలంటీర్లపై వల వేస్తోంది. ఎన్నికలకు ముందు వారిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అనేక కుట్రలు పన్నుతోంది. మే నెలలో ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను మూడు నెలల ముందుగానే అందజేస్తోంది. దారుణంగా ఉన్న రోడ్లను పట్టించుకోరు, పెండింగ్ బిల్లులతో ఆగిపోయిన సచివాలయ భవనాలు, ఆసుపత్రుల నిర్మాణాల గురించి ఆలోచించరు, ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను చెల్లించరు.. ఆఖరుకు పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయి లను కూడా జమ చేయరు.. కానీ షెడ్యూల్ కన్నా మూడు నెలల ముందే ఎన్నికల ముంగిట వలంటీర్లకు మాత్రం ‘వందనం’ పేరుతో భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. ఈ తంతు చూస్తున్న అటు ఉద్యోగులు, సామాన్యులు వైసీపీ అంతరంగాన్ని పసిగట్టి చర్చించుకుంటున్నారు.



**● పెరిగిన ప్రోత్సాహక నగదు**

ఎన్నికల నేపథ్యంలో ప్రోత్సాహకాలు అందుకునే వలంటీర్ల సంఖ్య, ప్రోత్సాహక నగదు మొత్తం పెరిగింది. జిల్లాలోని 769 సచివాలయాల పరిధిలో 13,295 మంది వలంటీర్లు ఉండగా దాదాపుగా వారందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం కింద గతేడాది మే నెలలో జిల్లాలో మొత్తం 11,359 మందికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అందులో సేవామిత్ర అవార్డులు 11,080 మంది, సేవారత్నలు 231, సేవావజ్ర అవార్డులు 44 ఉన్నాయి. నాడు సేవామిత్రకు రూ.10 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవావజ్ర అవార్డుకు రూ.30 వేల చొప్పున అందజేశారు. ఈ సంవత్సరం జిల్లాలో 12,783 మందికి ప్రోత్సాహకాలు అందజేస్తుండగా అందులో సేవామిత్రలు 12,517 మందికి, సేవారత్నలు 225 మందికి సేవావజ్రలు 41 మందికి ఇస్తున్నారు. ప్రస్తుతం సేవామిత్రకు రూ.15 వేలు, సేవారత్నకు రూ.30 వేలు, సేవావజ్రకు రూ.45 వేలు చొప్పున అందజేస్తున్నారు. మొత్తంగా జిల్లాలో గతేడాది సుమారు రూ.11.67 కోట్లను వలంటీర్లకు ప్రోత్సాహకాల రూపంలో అందజేయగా ఈ ఏడాది ఆ మొత్తం సుమారు రూ.20 కోట్లకు పెరిగింది.

**● వలంటీర్లకు బ్రెయిన్ వాష్**

వలంటీర్లకు పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. మండలాలు, డివిజన్లు, నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే ఈ కార్యక్రమాల వేదికగా వలంటీర్ల బ్రెయిన్ వాష్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులే కాకుండా అనేక మంది వేదికలపై ప్రసంగిస్తున్నారు. అదే సమయంలో కొంత మంది ప్రత్యేక వక్తలను తీసుకొచ్చి వారి ద్వారా ‘వైసీపీ ఎంత గొప్పదో.. మీరు వైసీపీకి రుణపడి ఉన్నారు’ అనే సందేశం ఇచ్చేలా ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు పని చేసేలా భారీ కుట్రలు జరుగుతున్నాయంటూ మరోవైపు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

---

# అందరిదీ మైనారిటీలపై మమకారమే!

**● మత పెద్దలతో సమావేశం, విందు ● కానుకలతో ఆకట్టుకునే ప్రయత్నం**



**కావలి (టౌన్), ఫిబ్రవరి 23 :** కావలి పట్టణంలోని మైనారిటీలను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మత పెద్దలు, ఇతర ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి, పసందైన రుచులతో విందు ఇవ్వడంతోపాటు కానుకలు కూడా అందజేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం, రాత్రి ముసునూరులోని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి తన నివాసంలో క్రైస్తవ ప్రముఖులు, మత పెద్దలు, పాస్టర్లతో సమావేశమయ్యారు. విందు ఏర్పాటు చేసి కానుకలు అందించడంతోపాటు ప్రార్థన మందిరాల అభివృద్ధికి వరాలు ప్రకటించారు. ఆ తర్వాత రాత్రి ముస్లిం మత పెద్దలు, మసీద్ కమిటీల పెద్దలు, ప్రముఖులతోనూ సమావేశమై విందు ఇచ్చారు. షాదీ మంజిల్ అభివృద్ధి పనులకు రూ.5లక్షలు, ముసునూరు ఆటోనగర్‌లోని సాద్ మసీదు నిర్మాణానికి రూ.1 లక్ష విరాళంగా నగదు అందించారు. ఇక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి కూడా మైనార్టీ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పట్టణ పరిధిలోని మసీదుల నిర్వాహకులను, ముస్లిం మతపెద్దలతోపాటు వైసీపీ మైనార్టీ నేతలనూ కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. శుక్రవారం జామియా మసీదులో జరిగిన ప్రార్థనలో కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం మత పెద్దలతో సమావేశమై మసీదు అభివృద్ధికి రూ.5 లక్షలు, ఆటోనగర్ మసీదుకు రూ.50వేలు విరాళం అందించారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న పసుపులేటి సుధాకర్ కూడా మసీదులు, చర్చిలకు విరాళాలు అందిస్తున్నారు.

---



ఏపీజీబీ ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

## గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

**నెల్లూరు (హరనాథపురం) :** తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నెల్లూరు రీజియన్‌కు చెందిన ఉద్యోగులు శుక్రవారం సమ్మె చేశారు. నెల్లూరు నగరంలోని ఆ బ్యాంకు ఎదుట జరిగిన ఆందోళనలో ఉద్యోగులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకులలో ఖాళీగా ఉన్న 30 వేల పోస్టులను భర్తీ చేయాలని, వాణిజ్య బ్యాంకులతో సమానంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంకులన్నిటినీ కలిపి ఒకే జాతీయ బ్యాంకుగా చేయాలని, ఉద్యోగులకు అలవెన్సులన్నీ వర్తింపజేయాలన్నారు. అనంతరం ఏపీజీబీ ఆర్ఎం టి.మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసనలో రీజినల్ కార్యదర్శి లియాకత్ అలీ, మునిరత్నం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---



## సోమశిలలో 18.726 టీఎంసీల నిల్వ

**అనంతసాగరం:** సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి జలాశయంలో 18.726 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

---



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్, సిరంజీలు

# కావలిలో గంజాయి గబ్బు!

### హైదరాబాద్ నుంచి డ్రగ్స్ దిగుమతి
### 8 మంది అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు

**కావలి, ఫిబ్రవరి 23 :** కావలిలో యువతే టార్గెట్‌గా కొంతమంది గంజాయి, డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి పట్టణంలోకి దిగుమతి చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ యువతను మత్తుకు బానిసలు చేస్తున్నారు. ఈ విషయం సాక్షాత్తు పోలీసుల దాడుల్లోనే వెలుగు చూసింది. మొత్తం 8 మందిని అరెస్ట్ చేయగా, ముగ్గురు పరారీలో ఉన్నట్లు కావలి డీఎస్పీ ఎం. వెంకట రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వన్‌టౌన్ సీఐ రాజేష్‌తో కలిసి కేసు పూర్వాపరాలను విలేకరులకు వెల్లడించారు. పట్టణ పరిధిలోని పాపిరెడ్డి చెరువు వద్ద గురువారం కొందరు యువకులు టైడల్ (మత్తు) మాత్రలను నీళ్లలో కలిపి సూది మందు ద్వారా ఎక్కించుకుంటున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించగా 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి నుంచి 900 గ్రాముల 9 గంజాయి ప్యాకెట్లు, టైడల్ మాత్రలు 10 షీట్లు, వంద సిరంజీలు, వంద మినరల్ వాటర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సునాని రుగ్దార్, కంబా ఉదయ్, దేవరకొండ నిఖిల్, షేక్ షాహిద్, వల్లెపు అభినయ్, పండిపట్ల దేవదానం, పల్లెబోయిన ఈశ్వర్ సాయి, దుంపాల జాన్ వసంత్‌లను అరెస్ట్ చేసిన వారిలో ఉన్నారు. ఒడిశాకు చెందిన మొదటి ముద్దాయి సునాని రుగ్దార్ కొన్నేళ్లుగా కావలిలోని ఇందిరానగర్‌లో ఉంటూ ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తునట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురు హైదరాబాదు నుంచి టైడల్ మాత్రలు తెచ్చి కావలిలో అధిక ధరలకు విక్రయిస్తూ యువతను డ్రగ్స్‌కు అలవాటు చేస్తున్నట్లు చెప్పారు.

---

# పాలలో మోసాలకు చెక్!

- అమలులోకి పాల సేకరణ చట్టం
- మిల్క్ ఎనలైజర్స్‌కు లైసెన్సులు తప్పనిసరి
- మోసాలు, కల్తీలు గుర్తిస్తే కఠిన చర్యలు

**నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 23 :** పాలసేకరణ, విక్రయాల్లో మోసాలను అరికట్టేందుకు పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం-2023ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం అమలుకు అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) రూపకల్పన, నిబంధనలతో అధికారిక గజిట్‌లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు తెలిపారు. పాల సేకరణతోపాటు ధరల చెల్లింపుల్లో తేడాలు, కల్తీలు గుర్తిస్తే ఆయా యూనిట్లను సీజ్ చేయడంతోపాటు చట్ట ప్రకారం జరిమానా, జైలుశిక్షలు విధించనున్నట్లు పేర్కొన్నారు.

**● రోజుకు 15లక్షల లీటర్ల పాల ఉత్పత్తి**

జిల్లాలో ప్రతిరోజు దాదాపు 15-16 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. స్థానికంగా 2లక్షల లీటర్ల వినియోగం, ప్రభుత్వ సహకార డెయిరీల ద్వారా 3లక్షల లీటర్లు, ప్రైవేటు డెయిరీల ద్వారా దాదాపు 10లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టం అమలు, పర్యవేక్షణ రాష్ట్రస్థాయిలో కార్య నిర్వాహక అధికారిగా పశుసంవర్ధక శాఖ సంచాలకులు వ్యవహరిస్తారు. జిల్లాస్థాయిలో ఆథరైజ్డ్ ఆఫీసర్‌గా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, ఏవీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్లు వ్యవహరించనున్నారు. చట్టం ప్రకారం మిల్క్ ఎనలైజర్స్‌తోపాటు పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీ), ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు (ఏఎంసీ) పనిచేసేలా పర్యవేక్షిస్తారు. పాల నాణ్యత పాటించకపోతే ఫుడ్ సేఫ్టీ నాణ్యతా ప్రమాణాల యాక్టు 2006 ప్రకారం చర్యలు తీసుకుంటారు. పాలల్లో కొవ్వు, ఎస్ఎన్ ఎఫ్ శాతాన్ని బట్టి నిర్దేశించిన ధరల పట్టిక ప్రకారం పాడిరైతులకు మద్దతు ధర దక్కేలా పర్యవేక్షిస్తారు. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ అభివృద్ధి చేస్తున్నారు. చట్టం అమలుపై రాష్ట్రస్థాయి లో ఎంపిక చేసిన రీసోర్స్ పర్సన్స్‌కు ఇటీవలే శిక్షణ కూడా పూర్తయింది. వీరి ద్వారా మండల స్థాయిలో మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరించే అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

**● లైసెన్సులు తప్పనిసరి**

మిల్క్ ఎనలైజర్లు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలి. తొలుత రూ. వెయ్యి చెల్లించి సంబంధిత ఆథరైజ్డ్ అధికారి నుంచి లైసెన్సు పొందాలి. అదేవిధంగా మిల్క్ డీలర్లు ప్రతి రెండేళ్లకోసారి రూ.2లక్షలు చెల్లించి మిల్క్ కమిషనర్ ద్వారా లైసెన్సు పొందాలి. ఆ తరువాత 120 రోజులలోపు వారి పరిధిలోని మిల్క్ ఇన్‌స్పెక్టర్ వద్ద రూ.500 చెల్లించి కనీసం ఏడాదిపాటు చెల్లుబాటు అయ్యేలా వెరిఫికేషన్ సర్టిఫికెట్ పొందాలి. మిల్క్ ఎనలైజర్స్ లైసెన్సు, వెరిఫికేషన్ సర్టిఫికేట్‌ను పాల సేకరణ కేంద్రాల్లో ప్రదర్శించాలి. అదేవిధంగా సంబంధిత రికార్డులను విధిగా నిర్వహించాలి.



**● క్రమం తప్పకుండా తనిఖీలు**

పాల సేకరణ కేంద్రాలు, డెయిరీలలో మిల్క్ ఇన్‌స్పెక్టర్ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తారు. మోసాలు, కల్తీలు గుర్తిస్తే జరిమానా, లైసెన్స్ రద్దుతోపాటు కేసు నమోదు వంటి చర్యలు తీసుకుంటారు. కల్తీ జరిగినట్లు గుర్తిస్తే తగిన చర్యల కోసం ఆహార భద్రత అధికారికి సమాచారం అందిస్తారు. మిల్క్ యూనియన్ డెయిరీ నిర్ధారించిన ధర పట్టిక ప్రకారం పాల ధరలు చెల్లిస్తున్నది లేనిది కూడా పరిశీలిస్తారు. జిల్లాస్థాయిలో ఆథరైజ్డ్ అధికారిగా వ్యవ హరించే అధికారులు ఈ మిల్క్ ఇన్‌స్పెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

---

# మామిడీలా!

- పది చెట్లకుగానూ నాలుగింటికే పూత
- ఆపై త్రిప్స్ వైరస్ దండయాత్ర
- పిందెపాటు అనుమానమే అంటున్న రైతులు
- కోలుకోవడం కష్టమేనంటున్న కౌలుదారులు
- ఈ ఏడాది కూడా గగనంగా మారనున్న సాగు

**ఉలవపాడు, ఫిబ్రవరి 23 :** ప్రతిఏటా డిసెంబరు ద్వితీయార్థం నుంచి ఫిబ్రవరి వరకు మామిడిచెట్లు పూతలు పూస్తూ పిందెపాటు దశలో ఉండేవి. అలాంటిది ఈ ఏడాది ఇంకా కొన్నిచెట్లు పూతలు పూయలేదు. ఒకవేళ పూసినా త్రిప్స్ వైరస్ దాడితో రాలిపోతున్నది. ఈ క్రమంలో ఈసారి కూడా మామిడిసాగు నష్టాలు మిగుల్చుతుందని కౌలుదారులు ఆవేదన చెందుతున్నారు. కందుకూరు డివిజన్‌లోని ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో సుమారు 7వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఎక్కువభాగం కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పూతలు బాగా ఆలస్యం కావడంతో పిందెపాటు పడని తోటలు దర్శనమిస్తున్నాయి. ఈపాటికి గోళీ సైజు పిందెలు వచ్చేవి. కాగా గత డిసెంబరులో వచ్చిన తుఫాన్ ప్రభావంతో భూమిలో తేమశాతం పెరిగి పూతలు వేయాల్సిన చెట్లు లేటలు (చిగుళ్లు) వేసి పూతలకు విఘాతం కలిగించాయి. దీంతో ఫిబ్రవరిలో పూతలు రావడం మొదలయ్యాయి. ఇప్పుడు వచ్చే పూతలు పిందెపాటు పడి నిలుస్తాయా.. లేదా? అనేది రైతుల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. ఇప్పుడి ప్పుడే ఎండలు పెరుగుతున్న కొద్దీ పూతల్లో తేమ తక్కువై కాడలకు బలం చేకూరడం కష్టం. దీంతో పూతలు రాలిపోతాయి. ఒకవేళ పిందె పాటు పడినా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పిందెలు కూడా తేమ శాతం తగ్గిపోవడంతో వాడిపోయి రాలిపోతాయని రైతులు అంటున్నారు.

**● త్రిప్స్ వైరస్ దాడి**

అసలే పూత సరిగా రాకపోగా పుండుపై కారం చల్లినట్లుగా వచ్చిన అరాకొర పూతపై త్రిప్స్ వైరస్ దాడి చేసి నాశనం చేస్తున్నాయి. నాలుగేళ్లుగా త్రిప్స్ వైరస్‌తో మామిడి రైతులు యుద్ధమే చేస్తున్నారని చెప్పొచ్చు. ఈ ఏడాది కూడా పూతలో తేమను పీల్చిపిప్పి చేస్తూ రాలిపోయేలా వైరస్ వ్యాప్తి చెందింది. దీన్ని పూర్తిగా నియంత్రించేందుకు ఇప్పటికీ ఎలాంటి పురుగు మందులు లేవు. ఉపశమనం కోసం ఎక్కువసార్లు మందులు పిచికారీ చేస్తూ దాని తీవ్రతను రైతులు తగ్గించుకుంటున్నారు. పురుగు మందుల ద్వారా పిందెలను ముంతమామిడి గింజంత సైజు వరకు కాపాడుకోగలిగితే త్రిప్స్ వైరస్ బారి నుంచి బయట పడినట్లేనని రైతులు చెప్తున్నారు. దీనికితోడు రాత్రుళ్లు మంచు ఎక్కువగా పడుతుండటంతో తేనెబంక తెగులు సోకి పూతలు నల్లబారి పోతున్నాయి.

**● దిగుబడిపై ప్రభావం**

ఈ ఏడాది కూడా మామిడి రైతులకు అన్ని ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. దీంతో మామిడిలో దిగుబడి బాగా తగ్గిపోనున్నదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క లేటు కాపు, మరోపక్క త్రిప్స్, తేనెబంక తెగుళ్ల తీవ్రం కావడం, ముదురుతున్న ఎండలతో కాపు తక్కువేనని వారు పేర్కొన్నారు.



పూత మీద ఉన్న చెట్టు పక్కనే లేటలు వేసి పూతకు నోచుకోని మామిడిచెట్లు

---

### ఎస్కేప్ నుంచి కమ్మవారిపాలెం వాగుకు విడుదల
### అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం
### సీబీఆర్ ఆయకుట్టులో ఎండుతున్న పంటలు

జలదంకిలో కొత్త చెరువు కింద ఎండుతున్న వరి



## సోమశిల జలాల
# అక్రమ తరలింపు!

**జలదంకి, ఫిబ్రవరి 23 :** కావలి కాలువ ద్వారా జరుగుతున్న సోమశిల జలాల పంపిణీ మొదటి బంతిలో కూర్చున్న వారికి పరమాన్నం.. చివరి బంతిలోని వారికి పచ్చడి మెతుకులు.. అన్న సామెతలా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా సోమశిల అధికారులు కావలి కాలువ ఎస్కేప్ చానల్ నుంచి కమ్మవారిపాలెం వాగుకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో (సీబీఆర్) నీరు లేక దాని ఆయకట్టు పరిధిలో పొట్ట దశలో ఉన్న సుమారు 5 వేల ఎకరాల్లో వరి పైరు ఎండుముఖం పట్టింది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరి ఆయకట్టు భూములైన జలదంకి మండలంలోని అన్నవరం, జలదంకి, గోపన్నపాలెం, ఎల్.ఆర్ అగ్రహారం పంచాయతీలలో వివిధ చెరువులు, కాలువల కింద సాగైన వరిపంట అంతా చిరుపొట్ట, వెన్నుదశల్లో ఉంది. ఈ క్రమంలో సీఎంవో నుంచి కావలి కాలువకు మరో 1.5 టీఎంసీల నీరు అదనంగా ఇవ్వాలని సోమశిల అధికారులకు ఆదేశాలందాయి. ఈ మేరకు నీటి విడుదలను పెంచారు. అయితే పెంచిన నీటిని ఎస్వీపాలెం మేజరు నుంచి కిందకు విడుదల చేయకుండా కొంతభాగం పై ప్రాం తం ఆయకట్టుకు, ఎస్కేప్ ఛానల్ ద్వారా విడుదల చేస్తూ చివరి ఆయకట్టుకు అందకుండా చేస్తున్నారు. దీని వల్ల నీటిని పెంచిన ఉద్దేశం నీరుగారింది. సీబీఆర్ నీటిమట్టం పడిపోయి కావలి కాలువ దిగువకు నీరు విడుదల కావడం లేదు. ఈ పెంచిన నీటిని యుద్ధప్రాతిపదికన కాలువ మీద ఉన్న మోటార్లు సైతం నిలిపి 400 క్యూసెక్కుల మేరకు చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు వారం రోజుల పాటు నిరంతరాయంగా విడుదల చేస్తే తప్ప రిజర్వాయరు నిండి దిగువకు నీరు విడుదల కాదు. ఈ నీరు విడుదలైతే తప్ప జలదంకి, అన్నవరం, గోపన్నపాలెం, ఎల్.ఆర్ అగ్రహారం పంచాయతీల్లో సాగులో ఉన్న 5వేల ఎకరాల వరి పంటకు నీరు చేరదు. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకో వాలని రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పర్యవేక్షణలో కావలి కాలువకు నీటి పం పిణీ చేపట్టాలని చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఎవరికి ఇష్టం వచ్చి నట్లు వారు నీటిని కాలువలు, చెరువులకు పెట్టుకుంటూ పోతే జలదంకి మండలం ఎడారిగా మారుతుందని రైతులు వాపోతున్నారు.



కావలికాలువ ఎస్కేప్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా కమ్మవారిపాలెం వాగుకు విడుదల చేసిన నీరు

# మద్యం సీసాలో పురుగులు

- సర్వేపల్లిలోని ఓ ఫ్యాక్టరీలో తయారీ
- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి
- తెలుగుయువత నేత రాజేంద్ర



మద్యం సీసాలో పురుగులను చూపుతున్న రాజేంద్ర

వెంకటాచలం, ఫిబ్రవరి 23 : వైసీపీ ప్రభుత్వం మద్యపాన నిషేధం చేయకపోగా నాసిరక మద్యాన్ని పేదలకు అందించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని తెలుగుయువత నేత యమల రాజేంద్ర విమర్శించారు. శుక్రవారం వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటాచలంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసిన యువకులు ఆ మద్యం తాగే క్రమంలో సీసాలో పురుగులు బయటపడ్డాయన్నారు. ఆ మద్యం సర్వేపల్లి సమీపంలోని ఓ ఫ్యాక్టరీలో తయారైనట్లు చెప్పారు. సదరు ఫ్యాక్టరీ నిర్వాహకులు నాసిరక మద్యం తయారు చేస్తుంటే ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారని, కనీసం తనిఖీలైనా చేస్తున్నారా అని ప్రశ్నించారు. నాసిరక మద్యం తాగి సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 15 మందికిపైగా చనిపోయారని, ప్రజల ప్రాణాలు పోతుంటే మంత్రి కాకాణికి పట్టదా అని నిలదీశారు. సదరు ఫ్యాక్టరీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# మూడిళ్లలో చోరీపై క్లూస్ టీమ్ పరిశీలన



బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ, క్లూస్‌టీమ్

అల్లూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని బీరంగుంటలో ఒకే రోజు మూడు ఇళ్లల్లో జరిగిన చోరీలపై శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ చోరీలో తిరుమలశెట్టి శ్రీనివాసులు నివాసంలో రూ1.40 లక్షలు, ఒక సవర బంగారు ఆభరణాలు, తిరుమలశెట్టి చంద్రమోహన్ నివాసంలో రూ.30 వేలు, 5 సవర్ల బంగారు ఆభరణాలు, నిమ్మకాయల సురేష్ గృహంలో రూ.20 వేలు, ఒక ఉంగరంను దుండగులు అపహరించుకొని వెళ్లారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్‌టీమ్ బాధితుల గృహాల్లో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గండికి ఇసుక బస్తాలతో రింగ్‌బండ్



ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేస్తున్న కూలీలు

సంగం, ఫిబ్రవరి 23: మండలంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ రెగ్యులేటర్ వద్ద ఏర్పడిన గండిని శుక్రవారం ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణ పరిశీలించారు. ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేయించారు. ఇటీవల కాలువ రెగ్యులేటర్ వద్ద బెడ్ కుంగిపోయి గండి పడి రెగ్యులేటర్‌కు ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తుండడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు వీలు పడలేదు. దీంతో ఇసుక బస్తాలతో గండిని పూడ్చి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు పంట సీజన్ ముగిసిన తరువాత కాలువలో నీటిని పూర్తిగా నిలిపివేసి శాశ్వత మరమ్మతులు చేపడతామని ఇరిగేషన్ ఏఈ బీవీ కృష తెలిపారు.

# బైకును ఢీకొన్న కారు

- తల్లి మృతి, తనయుడికి గాయాలు



షాహీనా మృతదేహం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 23 : నెల్లూరు - కొత్తకోడూరు రహదారిపై చిన్నచెరుకూరు క్రాస్ వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. నెల్లూరు రూరల్ పోలీసులు అందించిన వివరాల మేరకు... సౌత్‌ఆమలూరు గ్రామానికి చెందిన షాహీనా, ఆమె కుమారుడు అబుబకర్ సిద్దిక్ బైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి ఇంటికి పయనమయ్యారు. చిన్నచెరుకూరు క్రాస్ వద్దకు వచ్చే సరికి వీరి స్కూటర్‌ను కారు ఢీకొట్టింది. దీంతో వీరిద్దరు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌కు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో షాహీనా మరణించగా సిద్దిక్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం అందాల్సి ఉందని సీఐ సుబ్బారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

దగదర్తి(బిట్రగుంట), ఫిబ్రవరి 23: దగదర్తి మండలం సున్నపుబట్టి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... చెన్నై నుంచి ఒంగోలు వైపు వెళుతున్న ఓ కారు ముందు వెళుతున్న లారీని అధిగమించే క్రమంలో వెనక నుంచి వేగంగా ఢీకొనడంతో చెన్నైకి చెందిన కారు డ్రైవరు కాలింగి చంద్రశేఖర్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

# ఆటో బోల్తా పడి వ్యక్తి..

కలువాయి, ఫిబ్రవరి 23: చేజర్ల ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల లక్ష్మయ్య (65) ఆటో బోల్తా పడి తిరుపతి చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. గురువారం సాయంత్రం ఆయన మండలంలోని చవటపల్లి సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చేజర్ల ఎస్టీ కాలనీకి చెందిన పలువురు కూలీలు.. కలువాయి మండలం చవటపల్లి వద్ద పొలాల్లో కూలి పనులకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి చేజర్లకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న ఆటో రెండు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఆ సమయంలో ఘమారు డ్రైవరు దానయ్యతో పాటు ఆరు మంది కూలీలు ఉన్నారు. వెంటనే గాయపడిన కూలీలందరిని నెల్లూరు తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా ఆయన శుక్రవారం మృతి చెందారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అయ్యప్ప తెలిపారు.

# కాలువలో పడి సోమశిల జలవనరుల శాఖ ఉద్యోగి..

చేజర్ల, ఫిబ్రవరి23: సోమశిల జలవనరుల శాఖలో మ్యాన్ మజ్దూర్‌గా పని చేస్తున్న చేజర్ల మౌలాలి (61) బోడిపాడు సమీపంలోని సోమశిల దక్షిణ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం బోడిపాడు సమీపంలోని చేజర్ల అదురుపల్లి కాలువ బ్రిడ్జి వద్ద మృతదేహం తేలాడుతుండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించి మౌలాలిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయాన్నే విధులకు వెలుతున్నానని చెప్పి రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. కాలువలో మృతదేహమై కన్పించడంతో కుటుంబ సభ్యు లు కన్నీరుమున్నీరయ్యారు. మరో నెలలో ఉద్యోగ విరమణ పొందే వాడని తోటి ఉద్యోగులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 156 |
| లేయర్ లైవ్ | 80 |
| స్కిన్ చికెన్ | 270 |
| స్కిన్‌లెస్ | 300 |
| లేయర్ | 136 |

## బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 5905 |
| వెండి కిలో ధర | రూ. 71,500 |
| వెండి ఒక గ్రాము | రూ. 73.50 |

# అటు మంచు.. ఇటు మండుటెండ

- జిల్లాలో భిన్నవాతావరణ పరిస్థితులు



సంగం గ్రామంలో ఉదయం 8.30 గంటలకు కూడా మంచు



మధ్యాహ్నం ఎండ తీవ్రత

సంగం, ఫిబ్రవరి 23 : జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రయితే చలి తీవ్రత, ఉదయం పొగమంచు, మధ్యాహ్నం వేళల్లో నెత్తిన సూర్యుడి భగభగలతో మండుటెండలు ప్రారంభమైయ్యాయి. గడిచిన వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రాత్రి సమయాల్లో చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు వణుకుతున్నారు. ముఖ్యంగా ఉదయం వేళ మంచు అధికంగా ఉంటుండడంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో చలి గాలుల తీవ్రతతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఫలితంగా చలి విజృంభిస్తోంది. గురువారం తెల్లవారు జాము నుంచే చలి బాగా పెరిగింది. తెల్లారేసరికి దట్టమైన పొగమంచు ఆవరించింది. దీంతో వాతావరణ పరిస్థితి ఒక్కసారిగా భిన్నంగా మారిపోయాయి. రాత్రి 9గంటలకే చలి ప్రారంభమవుతోంది. తెల్లారినుంచి పొగమంచుతో బయటకు వెళ్లాలంటే జనాలు జంకుతున్నారు.

**పంటలకు తెగుళ్ల బెడద**

పొగమంచుతో పంటలకు తెగుళ్ల, చీడ పీడల బెడద అధికంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరి పంట ఎక్కువ శాతం ఎన్ను దశలో ఉంది. ఆలస్యంగా నాటిన వరిపైరు పొట్టదశలో ఉంది. ఈ పొగ మంచుతో దోమ అధికంగా పడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అయితే ఎండ తీవ్రత కూడా బాగా ఉండడంతో కొంత ఉపశమనం కలిగిస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఈ పొగమంచుతో మామిడి పూత, పిందె రాలిపోయే పరిస్థితి ఉందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండల తీవ్రత ఎక్కువే**

గత ఏడాదికంటే ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. సముంద్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఎండలు ఎక్కువగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి చివర్లోనే సూర్యుడు ఠారెత్తించే పరిస్థితులు నెలకొనడంతో మున్ముందు పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. గాలిలో తేమశాతం పెరగడంతో ఉదయం వేళల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదయం రహదారులను మంచు తెర లు కమ్మేస్తున్నాయి. చలిగాలుల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు.



అగ్ని మథనం కార్యక్రమంలో రిత్వికులు

# అష్టలక్ష్మి యాగం ప్రారంభం

- ఘనంగా అగ్రిప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 : నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ మైదానంలో 22వ అష్టలక్ష్మీ యాగం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. అష్టలక్ష్మీ పీఠం స్వామి పీతాంబరం రఘునాథాచార్య ఆధ్వర్యంలో పెరుమాళ్ ఆరాధన, అభిషేకం, అర్చన, బాలభోగ నివేదన, మంగళాశాసనాలు జరిగాయి. ఈ సందర్భంగా విఘ్నాలు తొలగి అనుకున్న మంచి పనులు జరిగేందుకు విష్వక్సేన హోమం జరిగింది. మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

# గ్రూపు-2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు : జేసీ ఆదర్శ్



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 23 : ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. ఆదివారం జరుగనున్న ఆ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం సమీక్షించారు. పరీక్షకు జిల్లాలో 80 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 23,908 మంది అభ్యర్థులు హాజరవు తున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి, లైటింగ్ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల కోసం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు సందేహాల నివృత్తి కోసం 0861-2331261 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ సమీక్షలో నెల్లూరు నగర కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో లవన్న, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం అవసరం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 23 : బీసీలకు రాజ్యాధికారం అవసరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. శుక్రవారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో విజయం సాధించడానికి పాలక పార్టీలు 54 శాతం జనాభా ఉన్న బీసీలకు ఎంగిలి మెతుకులు విదిలించినట్లు తాయిలాలు పంచుతున్నాయన్నారు. బీసీలకు రాజ్యాధికారం, సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పనమాల శ్రీహరిరావు మాట్లాడుతూ జిల్లాలో బీసీలకు మూడు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బూదాటి రాధయ్య, సంజీవయ్య, ఎస్ఎస్ యాదవ్, రఘురాం ముదిరాజ్, నక్క దినేష్, బీజేపీ పెంచలప్రసాద్, 40 బీసీ కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య

- విడవలూరులో ఆందోళన




తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘం నాయకులు

విడవలూరు, ఫిబ్రవరి 23: ప్రభుత్వానికి ప్రజలకు వారధులు అయిన జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు తెలిపారు. ఆంధ్రజ్యోతి జర్నలిస్టులపై దాడులకు నిరసనగా విడవలూరులో ఆ సంఘం నాయకులు స్థానిక జర్నలిస్టులతో కలసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ నిరసనలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు దానం మాల్యాద్రి, ముసలి నవీన్, గోల్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు ఆభరణాలు స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 23: ఎలాంటి బిల్లులు లేకుండా బంగారు ఆభరణాలను తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని పుత్తా ఎస్టేట్‌కు చెందిన ఎల్ కోటేశ్వరరావు శుక్రవారం ఒంగోలు వైపు నుంచి వస్తున్న జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో దిగారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్న రైల్వే పోలీసులు కోటేశ్వరరావును కూడా తనిఖీ చేశారు. ఆయన బ్యాగ్‌లో 187 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.65 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బంగారు నగలు, నగదుకు సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు. కోటేశ్వరరావు ఒంగోలులోని పలు బంగారు దుకాణాలకు ఆభరణాలు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని రైల్వే పోలీసులు తెలిపారు.

# ఉద్యోగం పేరుతో రూ.54లక్షల స్వాహా

సైదాపురం, ఫిబ్రవరి 23: సెంట్రల్ బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మాయ మాటలకు ఓ వివాహిత మోసపోయిన ఘటన మండలంలోని కలిచేడులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలు పూజారి చందన కథనం మేరకు.. గూడూరు కాలేజీలో చదివే సమయంలో చేజర్ల మండలం చవటపాలెంకు చెందిన రజితతో పరిచయం ఏర్పడింది. సెంట్రల్ బ్యాంక్‌లో మేనేజర్ ఉద్యోగం ఇప్పిస్తానని పలుమార్లు మొత్తం రూ.54 లక్షలు తీసుకుని మోసం చేసింది. డబ్బులు తిరిగి రూ.30లక్షలు ఇస్తానని చెప్పి కలిచేడు గ్రామానికి ఆ యువతి చేరుకుంది. డబ్బులు ఇవ్వకుండా తరువాత ఇస్తానని చెప్పడంతో యువతిపై 100 కాల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. మోసం చేసిన యువతిని స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

# ఆర్‌బీకేలతో రైతుల ముంగిటకే వ్యవసాయ సేవలు

- ఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి



ఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డిని సత్కరిస్తున్న రైతులు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 23 : ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ముంగిటికే వ్యవసాయ సేవలను తీసుకొచ్చిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడు తూ ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులను రైతులకు సంతృప్తికర స్థాయిలో అందజేస్తున్నట్లు చెప్పారు. మిచౌంగ్ తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు 80శాతం సబ్సిడీతో విత్తనాలను అందించామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కృష్ణారెడ్డి, ఉద్యానశాఖ బోర్డు మెంబరు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, జిల్లా పశువైద్యాధికారి మహేశ్వరుడు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎల్‌డీఎం శ్రీకాంత్, నాబార్డు డీడీఎం రవిసింగ్, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలతో దుష్ప్రచారం

- టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి హయత్‌బాషా



మాట్లాడుతున్న సాబీర్‌ఖాన్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 23 : మైనార్టీలు అమాయకులని, అందుకే సున్నిత విషయాలపై దుష్ప్రచారం చేసేందుకు వారిని వాడుకుంటున్నారని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి హయత్ బాషా ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఇలా వ్యవహరించటం దారుణమ న్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్‌ఖాన్ మాట్లాడుతూ సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చొక్కాలు మడత పెట్టే టైం వచ్చిందని ప్రకటించారని, అయితే జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జగన్ కుర్చీని మడత పెట్టేశారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ షంషుద్దీన్, న్యామతుల్లా, అల్లాబక్షు, అస్లాం, రియాజ్, రసూల్, చిన్నమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయి

- ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు పద్మావతి



మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 23 : బాలబాలికలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ (ఏపీఎస్‌సీపీసీఆర్) సభ్యురాలు బత్తల పద్మావతి తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వ హించారు. బాలబాలికలు చదువుకోవాల్సిన వయసులో వెట్టిచాకిరికి గురవుతున్నారని చెప్పా రు. బాలల హక్కులకు భంగం కలిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. జిల్లాలో బాలికల సంరక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ మాట్లాడుతూ పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఎస్‌వో సురేష్, సీపీవో శ్రీనివాసరావు, జిల్లా ప్రొబేషన్ అధికారి అంకయ్య, డెమో శ్రీనివాసరావు, పలు విద్యాలయాల ప్రిన్సిపాళ్ల, అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ పిన్‌కాక్ సిలాట్‌లో జిల్లాకు పతకాలు

- 2 స్వర్ణం, 16 రజతం సాధించిన క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 23 : మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన 7వ జాతీయ పిన్‌కాక్ సిలాట్ చాంపి యన్ షిప్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కే యతిరాజ్ తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో పాల్గొని రెండు బంగారు, 16 రజిత పతకాలు సాధించారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్తమంగా సాధన చేసి భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిన్‌కాక్ సిలాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ భరద్వాజ్‌రెడ్డి, జిల్లా కోశాధికారి విజయ చాముండేశ్వరి, నిర్వాహక కార్యదర్శి ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# డిగ్రీ పరీక్షలో ఐదుగురి డీబార్

వెంకటాచలం, ఫిబ్రవరి 23: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్షలు జరుగగా.. ఐదుగురు విద్యా ర్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్.మధు మతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో 2,627 మంది విద్యార్థులకు గాను 2,415 మంది హాజరు కాగా మిగిలిన 212 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని జీనెక్స్ డిగ్రీ కళా శాలలో ఒకరు, నాయుడుపేటలోని పీఆర్ ఆర్ వీఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు మొత్తం ఐదుగురు ఉన్నట్లు తెలిపారు.

# కలగానే పేదల పక్కా గృహాలు

● ఇల్లు లేక బస్టాండ్‌లోనే జీవనం

మర్రిపాడు, ఫిబ్రవరి 23: గూడు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు పక్కా గృహాల కల్పన పథకం ఆమడ దూరంలోనే ఆగిపోయింది. ప్రభుత్వాలు చెబుతున్న మాటలు ఉత్తి మాటలుగానే మిగిలిపోయాయి. నాలుగున్న ఏళ్లకాలంలో మండలంలో 936ఇళ్లు మంజూరవగా అందులో 646ఇళ్లు బేసిమెంట్‌కే పరిమితం అయ్యాయి. కేవలం 48ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మొత్తంలో 15మాత్రమే సొంత స్థలాలల్లో నిర్మించుకున్నారు. మిగిలినవన్నీ జగనన్న లేఅవుట్ లోనే నిర్మించేలా మంజూరు చేశారు. మౌలిక సౌకర్యాలు లేనందునే లబ్ధిదారులు ముందుకు రావటంలేదు. మండలంలో స్వంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించకపోవటంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందవరం గ్రామానికి చెందిన అన్నం నరసమ్మ(65) అనే ఒంటరి మహిళ రామానాయుడుపల్లి బస్ షెల్టరు ముందు వైపు పరదా పట్టలు చుట్టుకొని, అందులో తల దాచుకుంటూ ఏడాదిగా జీవనం సాగిస్తోంది. తనను ఆదుకునే వారు కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఆమె భర్త మరణించటంతో ఒంటరిగా బ్రతుకుతుండగా ఏడాది క్రితం కురిసిన తుఫాన్‌తో సొంత ఇంటి గోడలు కూలిపోయాయి. దీంతో దగ్గర్లో ఉన్న రామానాయుడుపల్లి బస్ షెల్టరు దిక్కయ్యింది. ఆదరణలేక, ప్రభుత్వ పరిహారం అందక ఒంటరిగా బ్రతుకు బండిని నెట్టుకొస్తుంది. సొంత స్థలం వున్నప్పటికీ ఇళ్లు మంజూరు చేయాలని రెండు సార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదంటూ ఆమె వాపోతున్నారు.



గోడలు కూలిపోయిన సొంత ఇల్లు, (ఇన్‌సెట్లో) బస్ షెల్టరులో ఉంటున్న నరసమ్మ

# విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దారు నెహ్రూబాబు

ఉదయగిరి, ఫిబ్రవరి 23: ఎన్నికల విధుల్లో బూత్ లెవల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు నెహ్రూబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో 36 బూత్‌ల పరిధిలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలో బూత్ స్థాయి అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక సమావేశ మందిరంలో మండలంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటి నుంచే వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు.



బీఎల్‌వోలతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసులు

## అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 23: విద్యార్థుల్లో ఉపాధ్యాయులు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో-2 టోత శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం దేకూరుపల్లి, జీ.అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తిని ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

## నీటి సమస్యపై కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 23: నెల్లూరుపాలెంలో నిర్మించిన టిట్కో భవనాల్లో ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ షేక్ పజుల్లాకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. నీటి సమస్య పరిష్కారానికి అనుమతి ఇస్తే తాము స్వంతంగా బోర్లు వేసుకుంటామని టిట్కో భవనవాసులు కోరారు. అయితే అందుకు ఆయన నిరాకరించారు. స్వంత బోర్లు వేసేందుకు అనుమతి ఇచ్చే అధికారం తనకు లేదని కౌన్సిల్ సమావేశంలో తెలిపి వారి ఆమోదంతో చేయాలన్నారు. ప్రస్తుతం నీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## శిథిలావస్థలో కమ్యూనిటీహాలు



అనంతసాగరం, ఫిబ్రవరి 23: ఇస్కపల్లిలో నిర్మాణదశలో ఉన్నా కమ్యూనిటిహాలు పనులు పూర్తికాకుండానే శిథిలావస్థలకు చేరుకుంది. 10 ఏళ్ల క్రితం ఎంపీ నిధులతో పనులు ప్రారంభమవగా.. నిధుల మంజూరులో జాప్యంతో నిర్మాణదశలో పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి దాన్ని ఉపయోగంలోకి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎన్నికల ప్రచారంలో కురుగొండ్ల



ప్రజలకు అభివాదం చేస్తున్న కురుగొండ్ల

కలువాయి, ఫిబ్రవరి 23: తెలుగుదేశం ప్రభుత్వంలో వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మంచి చేశామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం వెదనపర్తి, కేశమనేనిపల్లిలో రెండోరోజూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో ఎక్కడ మచ్చుకైనా అభివృద్ధి పనులు జరుగలేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, దనియాల చంద్రయ్య నాయుడు, జగదల్ నాయుడు, సోమయ్య యాదవ్, కిషోర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## తాగునీటి పథకానికి రూ.19 లక్షల మంజూరు

లింగసముద్రం, ఫిబ్రవరి 23 : లింగసముద్రం పంచాయతీలోని పలు కాలనీల్లో తాగునీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ పథకం కింద రూ.19 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టీ.సాగర్ శుక్రవారం తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పంచాయతీలోని లింగసముద్రం, యాదవుల బజారు, రామకృష్ణాపురం, జంపాలవారిపాలెంలో పైపులైన్ వేసేందుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేస్తామన్నారు.

## ఎంపీడీవో బదిలీల్లో తీరని ఉత్కంఠ

వరికుంటపాడు, ఫిబ్రవరి 23: ప్రకాశం జిల్లా యద్దనపూడి మండలం నుంచి బదిలీపై వచ్చిన తోట వెంకటకృష్ణకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి యథాస్థానమైన బోగోలు ఈవోపీఆర్డీగా వెళ్లేందుకు సుముఖంగా లేకపోవడంతో అటు కార్యాలయంలోనూ ఇటు ప్రజల్లోనూ ఎంపీడీవో నియామకంపై చర్చ జరుగుతోంది. గురువారం విధులు చేపట్టేందుకు నూతన ఎంపీడీవో రావడంతో ప్రస్తుతం ఉన్న ఎంపీడీవో తాను ఇక్కడే ఉండేందుకు గడువు కోరడంతో చేసేదేమీ ఏమీలేక ఆమె వెనుతిరిగి వెళ్లిపోయారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎట్టకేలకు బాధ్యతలు చేపట్టారు. పట్టువీడని ప్రస్తుత ఎంపీడీవో తమదైనశైలిలో అధికార పార్టీ నాయకుల చెంత చేరి ఉన్నతాధికారులపై వత్తిడి చేసేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆ నాయకులు ఆమెకే వత్తాసు పలుకుతుండడం అనుమానాలకు తావిస్తోంది. కాగా అక్కడి సిబ్బంది సైతం శుక్రవారం ఎవరు ఎంపీడీవోగా ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితిలో మండల ప్రజలు ఉన్నారు.



ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి

## వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు, ఫిబ్రవరి 23: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. శుక్రవారం తూర్పురొంపిదొడ్లలో నిర్వహించిన రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిబిరం ద్వారా అన్నిరకాల వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అయేషా, అబీద్, మాధవ, సుబ్రహ్మణ్యం, వైసీపీ మహిళా నాయకురాలు బత్తిన కొండమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఎంతో దోహపడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు రామాంజనేయులయాదవ్ అన్నారు. జనగన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అప్పసముద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యులు శివకల్పన పాల్గొన్నారు.

## జన్నత్‌హుస్సేన్ మృతికి సంతాపం

ఉదయగిరి, ఫిబ్రవరి 23: జిల్లాలో మంచికి మారుపేరుగా పనిచేసిన రిటైర్డ్ కలెక్టర్ జన్నత్‌హుస్సేన్ మృతికి శుక్రవారం పలువురు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, జేవీవీ జిల్లా రజతోత్సవ అధ్యక్షుడు పారుఖ్‌అలీ, గడియాల్పీ ఎస్థానీ, ఉప సర్పంచ్ ముర్తుజా ఉన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 23: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీవో పచ్చవ లావణ్య హెచ్చరించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలని..మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళావతి, రత్న, తేజస్విని, షాను పాల్గొన్నారు.

## పొలం వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 23: పొలం వివాదంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపాడు, రెడ్డిదిన్నె గ్రామాల పరిధిలోని ఓ భూమి వివాదంలో ఉంది. ఆ పొలం తమదని ఇరువర్గాల మధ్య కొంత కాలంగా వాదన జరుగుతోంది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ పూర్తయ్యే వరకు ఎవరూ పొలంలోకి వెళ్లవద్దని అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయితే రెడ్డిదిన్నెకు చెందిన కొసినపోగు బాబు, తిరుపతయ్యలు శుక్రవారం వివాద భూమిలో దున్నుతుండగా నందిపాడుకు చెందిన కొసినపోగు దేవయ్య, పెంచలయ్య పొలం చదును చేస్తున్న వారిని అడ్డుకున్నారు. దీంతో బాబు, తిరుపతయ్య వారిపై దాడి చేయడంతో దేవయ్య, పెంచలయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెంచలయ్యకు మెరుగైన వైద్యం అవసరం కాగా ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

# వారి నిర్ణయానికే కట్టుబడి ఉంటా

● ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 23: టికెట్ విషయంలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసు కొన్నా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నిర్ణయానికే కట్టుబడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. శుక్రవారం ఉదయగిరి ఫంక్షన్ హాలులో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న అధ్యక్షతన జరిగిన నియోజక వర్గస్థాయి సమావేశంలో బొల్లినేని మాట్లాడా రు. టికెట్ విషయంలో చంద్రబాబు, లోకేష్‌లు ఇంతవరకు తనను పిలిచి అడిగిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గాన్ని ఎవరూ చేయని విధంగా తాను అభివృద్ధి చేసినట్లు చెప్పుకొ చ్చారు. 2012లో నాటిన మొక్క నేడు చెట్టుగా మా రి ఫలాలు ఇస్తుంటే, ఆ ఫలాలను మరొకరికి ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. చంద్రబాబు గీసిన గీతను తాను ఏనాడూ దాటలేదని, అవసరమైతే టిక్కెట్ విషయంలో ఆయనతో గట్టిగా మాట్లాడతానన్నారు. టికెట్ విషయంలో నెలకొన్న గందరగోళంపై నియోజకవర్గ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణను పలువు రు నాయకులు, కార్యకర్తలు నిలదీశారు. 'మీరేం చేస్తున్నారు.. ఇక్కడ ఎవరి బలమేంటో అధిష్టానానికి చెప్పాల్సిన అవసరం లేదా.. ప్రతిసారి ఎన్నికలకు ముందు ఈ టికెట్ల గోల ఏమిటని నిలదీశారు. బొల్లినేని వెంకటరామారావుకే టికెట్ కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మన్నేటి వెంకటరెడ్డి, దంతులూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు పేలపూడి వెంకటర్నతం, చంద్ర మధు, రియాజ్, మల్లంపాటి గురవయ్యనాయుడు, బొజ్జా నరసింహులు, కాకి ప్రసాద్, నల్లిపోగు రాజా, నరసింహ, గడ్డం వెంకటేశ్వర్లు, బొజ్జా శ్రీనివాసులు, చీదర్ల మల్లికార్జున, సందానీ, సజిల్, మాబాషా, అబ్బయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొల్లినేని రామారావు

## నేడు ప్రసన్నుడికి పౌర్ణమి గరుడసేవ

బిట్రగుంట, ఫిబ్రవరి 23 : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మాస పౌర్ణమి సందర్భంగా శనివారం గరుడ సేవ నిర్వహించను న్నట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ, చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మున్సిపల్ గదిలో ప్రైవేటు వ్యక్తి తిష్ఠ!

కందుకూరులో చర్చనీయాంశం

కందుకూరు, ఫిబ్రవరి 23: ప్రభుత్వ స్థలం ఆక్రమణ, దర్జాగా కబ్జా లాంటి వార్తలు మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అయితే కందుకూరులో ఏకంగా మున్సిపాలిటీ లక్షలు వెచ్చించి నిర్మించిన గదిలో ఓ వ్యక్తి ఈ గది నాదంటూ దర్జాగా టేబుల్, కుర్చీలు వేసుకుని కూర్చున్నాడు. అధికారులు రమ్మంటున్నారని మున్సిపల్ సిబ్బంది వచ్చి పిలిచినా ఈ గది నాది ఏమైనా మాట్లాడదలిస్తే అధికారులనే నా వద్దకు రమ్మనండి అని వ్యక్తి హుంకం జారీ చేస్తుండడం విశేషం. అది మున్సిపల్ స్థలమేనని బల్లగుద్ది చెబుతున్న అధికారులు మాత్రం కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని చెబుతున్న కారణంగా అతని వద్దకు వెళ్లే సాహసం చేయలేకపోతున్నారు. ఇది శుక్రవారం కందుకూరు పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. పట్టణంలోని త్యాగరాజస్వామి గుడి సమీపంలో ప్రధాన రహదారికి పడమర వైపున ఒంగోలుకు చెందిన ఓ డాక్టరుకు గతంలో స్థలం ఉండేది. ఆ స్థలంకు ఆనుకుని పామూరు రోడ్డు నుంచి పాత టింబర్ డిపో వైపు వెళ్లే రోడ్డు కార్నర్‌లో కొంత మున్సిపాలిటీ స్థలం ఉండేది. పురాతనకాలంలో ఆ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి ఇటీవలి కాలంలో దానికి కూడా కొలతలు వేసి స్థానికులకు అమ్మేసుకుని వెళ్లే ప్రయత్నం చేయగా మున్సిపల్ అధికారులు కొలతలు వేసి ఇంతవరకు మున్సిపల్ స్థలమని తేల్చి చెప్పటంతో ఆ డాక్టరు తనకు సంబంధించిన స్థలాన్ని విక్రయించుకుని వెళ్లాడు. మున్సిపల్ స్థలంగా నిర్ధారించిన స్థలం మంచి వాణిజ్య కూడలి కావడం, అక్కడ గది స్థలం రూ.15 లక్షల వరకు ధర పలుకుతుండటంతో ఆ స్థలంలో ఇటీవలే మున్సిపాలిటీ రమారమి రూ.5 లక్షల వరకు ఖర్చుచేసి ఓ వాణిజ్య రూమును నిర్మించి షట్టర్లు ఏర్పాటు చేశారు. అయితే షట్టర్లకు ఇంకా తాళాలు వేయకముందే శుక్రవారం సాయంత్రం ఆ వ్యక్తి వచ్చి టేబుల్, కుర్చీలు ఆ గదిలో వేసుకుని కూర్చున్నాడు. ఈ గది నాదేనని తనవద్ద కోర్టు ఆర్డర్ ఉందని హూంకరించాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా ఆ స్థలం, గది మున్సిపాలిటీదేనని.. అందులో ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు. స్ట్రీట్ సర్వే రికార్డు, ఇతర రికార్డులన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. అయితే అతను ఏ పత్రాలు కోర్టుకు సమర్పించాడో, ఆ ఆర్డరు ఎలా వచ్చిందో చూడాల్సి ఉందన్నారు. కోర్టు ఉత్తర్వులు పరిశీలించాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఎట్టిపరిస్థితుల్లో గదిని స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



మున్సిపల్ అధికారులు నిర్మించిన గదిలో ప్రైవేటు వ్యక్తి వేసుకున్న టేబుల్, కుర్చీలు

## జామియా మసీద్‌లో 'కావ్య' ప్రార్థనలు

● జామియా మసీద్‌కు రూ.5లక్షల విరాళం

కావలి, ఫిబ్రవరి 23: కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జామియా మసీద్‌లో ముస్లిం పెద్దలతో కలిసి శుక్రవారం టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి ప్రార్థనలు చేశారు. ముస్లింల విన్నపం మేరకు మసీద్ అభివృద్ధికి రూ.5లక్షలు విరాళం ఇస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా కావ్య క్రిష్ణారెడ్డి విజయం సాధించాలని ముస్లింలు దువా చేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముస్లింలకు మరో శ్మశాన వాటికను, ఉర్దూ, అరబిక్ పాఠశాల, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. షాదీమంజిల్ పనులు కూడా పూర్తి చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్ అధ్యక్షుడు సయ్యద్ రఫీద్, ముస్లిం నేతలు కిర్మాని సర్దార్, మౌలానా రషీద్, షేక్ ఇబ్రహీం, షేక్ హజరత్, షేక్ ఖమర్‌బాబు, సయ్యద్ రహీం, ఖాదర్‌బాష, రియాజ్, హఫీజ్, హుస్సేన్, కరిముల్లా, నవాజ్‌ఖాన్ , పీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



జామియా మసీదులో ప్రార్థన చేస్తున్న కావ్య

టీడీపీలో పలువురి చేరిక : ముసునూరు 15వ వార్డుకు చెందిన ముస్లింలు పలువురు షేక్ నాయబ్ రసూల్, షేక్ మహ్మద్‌ల ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు.

## కందుకూరులో మార్పు తథ్యం : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 23: కందుకూరు పట్టణంలో రాజకీయంగా ఈసారి మార్పు కనిపిస్తోందని, ప్రజలు తెలుగుదేశం పార్టీవైపే ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 2వ వార్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నేతలతో కలిసి ఇంటూరి నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, షేక్ నాగూర్, యర్రా మునలయ్య, మల్లికార్జున, ఖాదర్‌బాషా, కూనం నరేంద్ర, రఘు, నాగూర్‌బాబు, మస్తాన్‌వలి, నాగరాజు, లక్ష్మణ్, వెంకాయమ్మ, రావి కోటేశ్వరమ్మ, మయూరి, మస్తాన్‌బాషా, మున్వార్, మధు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

## ఎస్వీపీఎంకు 160 క్యూసెక్కులు ఇవ్వాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 23: ఒప్పందం ప్రకారం ఎస్వీపీఎం కాలువకు కేటాయించిన 160 క్యూసెక్కుల సాగునీరు ఇవ్వాలని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అధికాలను ఆదేశించారు. బోగోలు మండలం కావలి కాలువ ఎస్వీపీఎం బ్రాంచ్ కాలువకు శుక్రవారం ఆయన సోమశిల జాలాలు విడుదల చేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ వీరరఘు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మాల్యాద్రి, సర్పంచులు మాచర్ల, సురేష్‌గౌడ్, రైతు నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, తదితరులు ఉన్నారు.



నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

## అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 23 : అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఫారెస్టర్ నాగయ్య తెలిపారు. మండలంలో అటవీ భూములు ఆక్రమణ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం ఆక్రమణలకు గురైన అటవీ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను అక్రమంగా నరికివేసి తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.



అయ్యవారిపల్లెలో అటవీ భూములను పరిశీలిస్తున్న అటవీ అధికారి నాగయ్య

## జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన కరువు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 23 : మండలంలోని బడేవారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్పందన కరువైంది ఈ వైద్యశిబిరంలో రోగుల కంటే వైద్య సిబ్బందే అధికంగా కనిపించారు. రోగులు లేక కుర్చీలు ఖాళాగానే దర్శనమిచ్చాయి. ఉదయం 9-30 గంటలను ప్రారంభించాల్సిన వైద్య శిబిరం ప్రజలు లేక 11 గంటలకు ప్రారంభించారు. అప్పటికీ కూడ 20 మందికి మించి రోగులు రాలేదు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామంలోకి వచ్చే సరికి ప్రజలు పొలాలకు వెళ్లిపోయారు. దీంతో వైద్య శిబిరం ప్రజలు లేక వెలవెలపోయింది. దీనికి తోడు గ్రామంలో ప్రచారం లేకపోవడం, శిబిరానికి వచ్చిన వారికి అన్నిరకాల జబ్బులకు మందులు లేకపోవడంతో ప్రజలు పెదవి విరిశారు.

## మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేత

వింజమూరు, ఫిబ్రవరి 23: మండలంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ మహిళా శిక్షణ కేంద్రంలో శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ కుట్టుమిషన్, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసుకున్న మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి అశ్వ వాహన సేవ

కావలిటౌన్, ఫిబ్రవరి 23: ముసునూరు ట్రంకురోడ్డులో మందాటి చెరువు వద్ద వెలసి వున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి శుక్రవారం అశ్వవాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకుడు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోమల సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం పూజలు, వేంకటేశ్వరస్వామి వ్రతపూజలు జరిగాయి. రాత్రి శ్రీవారు అశ్వవాహనంపై పట్టణ పుర వీధుల్లో ఊరేగారు. భక్తులు అడుగడునా స్వామివారికి బ్రహ్మరథం పట్టారు.



## 24 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఫిబ్రవరి 23: కావలి పట్టణ పరిధిలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలో 24 మద్యం సీసాలు పట్టుబడ్డాయని రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. తమిళనాడులోని రేవతిపురంకు చెందిన సత్యన్నారాయణ హరిహరన్ తన కారులో హైదరాబాద్ నుంచి చెన్నైకు తన కారు డిక్కీలో మద్యం సీసాలు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. నిందితుడుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఓటర్ల జాబితాలో అవకతవకలు సరి చేయాలి




ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉలవపాడు, ఫిబ్రవరి 23 : నూతనంగా వచ్చిన ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిచేసుకోవాల్సిన బాధ్యత ప్రతి బీఎల్వోపై ఉందని తహసీల్దారు రవిబాబు సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు అధ్యక్షతన మండల బీఎల్వోలతో స్వీప్‌పై అవగాహన సమావేశం జరిగింది. అనంతరం ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, బీఎల్వోలు పాల్గొన్నారు.

## షర్మిల అక్రమ అరెస్టుకు నిరసన

జలదంకి, ఫిబ్రవరి 23: దగా డీఎస్సీ పేరుతో సచివాలయం ముట్టడి కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కాంగ్రెస్, వామపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జలదంకి బస్టాండు కూడలిలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వీ.శివశేఖరరెడ్డి, సీపీఐ నేతలు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, సీపీఎం నాయకుడు మేలంగి ఆంథోనీ పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి వీఆర్‌వోల నియామకం

లింగసముద్రం, ఫిబ్రవరి 23 : లింగసముద్రం, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాలకు ఇన్‌చార్జి వీఆర్‌వోలను నియమించారు. లింగసముద్రం గ్రామానికి రెగ్యులర్ వీఆర్‌వో లేక ఇక్కట్లు శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు తహసీల్దారు శ్రీచరణ్ స్పందించారు. లింగసముద్రంకు పెదపవని-2 వీఆర్‌వో షేక్ మస్తాన్‌వలి, చీమలపెంట, రాళ్లపాడుకు అన్నెబోయినపల్లి వీఆర్‌వో ప్రసాద్‌ను నియమించారు.

## తూతూ మంత్రంగా సామాజిక తనిఖీలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 23 : మండలంలో ఉపాధి హామీ పనులపై చేపడుతున్న సామాజిక తనిఖీలు తూతూమంత్రంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 20వ తేది నుంచి సామాజిక తనిఖీ బృందాలు మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.8.95 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారు. అయితే సామాజిక తనిఖీ బృందాలు ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద కమీషన్లు దండుకొని తప్పులును కప్పిపుచ్చుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూలీలను విచారించడంలేదని, బోగస్ మస్టర్లు గుర్తించడంలేదని, పనుల వద్దకు వెళ్లి పూర్తిస్థాయిలో కొలతలు తీయడంలేదని, కేవలం ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పినట్లు రికార్డులు సిద్ధం చేస్తున్నారన్నా ఆరోపణలున్నాయి. అక్రమాలు నిర్ధారణ అయితే లక్షల్లో రికవరీలు ఉంటుంది. ఇప్పటికైనా సామాజిక తనిఖీ బృందాలు పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

## రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న రోటరీ సభ్యులు

కావలి, ఫిబ్రవరి 23: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. రోటరీ 119వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఉత్తర శివార్లలోని నయరా పెట్రోల్ బంక్ ప్రాంగణంలో శుక్రవారం కావలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 50 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కావలి అధ్యక్షుడు చెన్నంశెట్టి దినేష్, ప్రముఖులు డాక్టర్ మాధవరెడ్డి, నల్లూరు రవికుమార్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, కే.గోపి క్రిష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, నయరా ఎనర్జీ సేల్స్ ఆఫీసర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

# అక్రమ కేసులు పెట్టడంలో కింగ్ కాకాణి

● బీసీ గర్జన సభలో మాజీ మంత్రి సోమిరెడ్డి



కాకాణి ఇచ్చిన వాగ్దానాలను వివరిస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

**తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 23:** తెలుగుదేశం నాయకులపై అక్రమ కేసులు పెట్టడంలో.. వసూళ్ల పాల్పడటంలో మంత్రి కాకాణి పేరు పొందారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం నరుకూరు రిషి కల్యాణ మండపంలో జరిగిన జయహో బీసీ గర్జన సభలో ఆయన మాట్లాడారు. బీసీలపై సర్వేపల్లి నియోజకవర్గంలో 81 మందిపై అక్రమ కేసులు, దాడులు పెరిగాయని బీసీల గురించి మాట్లాడే అర్హత కాకాణికి లేదన్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి కంటైనర్ టెర్మినల్‌లో పనిచేస్తున్న 7వేలు మంది బీసీ కుటుంబాలు వీధినపడ్డారని టెర్మినల్ తరలిపోతే ఎమ్మెల్యే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పి.. బండేపల్లి కాలువ పూర్తి చేస్తేనే ఓట్లు అడుగుతానని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాకాణికి అధికారం వస్తే సర్వేపల్లి నియోజకవర్గాన్నే అమ్మేస్తారన్నారు. కాకాణి చేస్తున్న పేదల పట్టాలు పేరుతో భూకుంభ కోణాన్ని త్వరలో బయటపెడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, రుద్రకోట సదాశివ, పోలిశెట్టి, కొణతం రఘుబాబు, ముత్యాల శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు మునిరత్నం పాల్గొన్నారు.

● **మాటలు తప్ప అభివృద్ధి లేదు**

**వెంకటాచలం :** వైసీపీ ప్రభుత్వంలో మాటలు తప్ప అభివృద్ధి లేదని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. ఇడిమేపల్లి, జంగాలపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి టీడీపీని ఆదరించాలని కోరారు. తొలుత భారీ మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, చల్లా నాగార్జున్‌రెడ్డి, ఈపూరు మురళీధర్‌రెడ్డి, ఏలూరు కృష్ణారెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, చాట్ల వెంకటసుబ్బయ్య, గుమ్మా రాజగోపాల్, శ్రీనివాసులు, ఏడుకొండలు, దిలీప్, సుమన్ తదితరులున్నారు.

## విశ్వకర్మ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**బుచ్చిరెడ్డిపాళెం :** ప్రధాని నరేంద్రమోదీ ఏర్పాటు చేసిన విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు అన్నారు. శుక్రవారం బుచ్చిలోని బీజేపీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా ఓబీసీ మోర్చా మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల రామకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరి వినయ్‌నారాయణ, మండల అధ్యక్షుడు బండారపు రవీంద్ర, కీలుకుప్ప, శ్రీనివాసులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## కౌంటింగ్ హాల్ పరిశీలన

**వెంకటాచలం :** గొలగమూడి సమీపంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ (ఐఐటీటీఎం) కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్‌ను శుక్రవారం నెల్లూరు కమిషనర్ వికాస్‌మర్మత్ పరిశీలించారు. ఈవీఎం మెషీన్లను భద్రపరిచేందుకు, ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించేందుకు విశ్వవిద్యాలయం, ఐఐటీటీఎం కళాశాల భవనంలోని సౌకర్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, అర్బన్ తహసీల్దారు వెంకటేశ్వర్లు, సర్వేయర్ సోమేశ్వరరావు ఉన్నారు.

## సైనిక్ సొసైటీలో అదాని వరల్డ్ (సైనిక్) స్కూల్‌కి రెండో ర్యాంకు

**ముత్తుకూరు, ఫిబ్రవరి 23 :** దేశంలోని కొత్తగా ఏర్పరచిన 19 సైనిక్ స్కూల్స్‌లో కృష్ణపట్నంలోని అదాని వరల్డ్ (సైనిక్) స్కూల్ రెండో స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సిరియాల తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం అదాని సైనిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విలువ - ఆధారిత విద్యతోపాటు సాంస్కృతిక అవగాహన, మేధో ప్రవీణ, ఆత్మవిశ్వాసం, అత్యంత నైపుణ్యం, దేశభక్తి, స్వావలంబన, నాయకత్వ లక్షణాలతో కూడిన యువజన సమాజాన్ని సృష్టించడమే అదాని సైనిక్ స్కూల్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సాయుధ దళాలలో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచడం లక్ష్యమన్నారు.

## దీక్షకు సీపీఎం మద్దతు

**ముత్తుకూరు, ఫిబ్రవరి 23 :** కృష్ణపట్నం పోర్టు నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార సంఘం నాయకుడు గోవిందు చేపట్టిన దీక్షకు శుక్రవారం సీపీఎం నాయకులు గడ్డం అంకయ్య మద్దతు తెలిపారు. మూడు రోజులుగా గోవిందు అమరణ నిరాహార దీక్ష చేస్తున్న పోర్టు యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణం నిర్వాసిత గ్రామాల ప్రజల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదాని కృష్ణపట్నం పోర్టులో స్థానికులకు అన్యాయం జరుగుతోందని, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నక్కా రాధయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

## టూరిజం కోర్సులో చేరండి

**వెంకటాచలం :** గొలగమూడి సమీపంలోని టూరిజం కళాశాలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం) కళాశాల నోడల్ అధికారి సంజీవ్‌రెడ్డి కోరారు. ఐఐటీటీఎం కళాశాలలో ఈ విషయమై శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, బీబీఏ కోర్సులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు 94907 87854, 99664 62786 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఐఐటీటీఎం సౌత్‌జోన్ జోనల్ హెడ్ డాక్టర్ మీరా, ఆర్ అభిలాష్ తదితరులున్నారు.

## కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన

**బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 23:** మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, ఈవో వీ.గిరికృష్ణ, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతీదేవి పూజ

**పొదలకూరు, ఫిబ్రవరి 23 :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సరస్వతీదేవి పూజ నిర్వహించి పది విద్యార్థులకు పరీక్ష హాల్‌టిక్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో చదివి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాల్సిందిగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వారం పాటు ఎన్ఎస్ఎస్ శిబిరం

**ముత్తుకూరు, ఫిబ్రవరి 23:** మత్స్య కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరిగే ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యన్ కోరారు. తాళ్లపూడిలో మత్స్యకళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని వైసీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ధనపాల్, మెడికల్ ఆఫీసర్ చందనప్రియ, పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలు

**వెంకటాచలం, ఫిబ్రవరి 23:** మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం జరిగిన బీఏ ఎల్ఎల్‌బీ ఐదవ సంవత్సరం ఏడవ సెమిస్టర్ పరీక్షలలో 84 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఐదవ సంవత్సరం 9వ సెమిస్టర్ పరీక్షలలో 75 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్ కుమార్ బాబు తెలిపారు. పరీక్షలను విజయానంద్ కుమార్ బాబుతో పాటు డాక్టర్ కోట నీలమణి కంఠ పర్యవేక్షించారు.



# క్రీడాకారులకు ప్రోత్సాహం

● టీడీపీ కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



క్రీడాకారులతో దినేష్‌రెడ్డి

**కోవూరు, ఫిబ్రవరి 23:** టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. వేగూరులో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అంతర్జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన వేగూరుకు చెందిన మోచర్ల నరేంద్ర, దంపూరుకు చెందిన నాసిన ప్రణయ్‌లను ఘనంగా సన్మానించారు. పోటీలకు హాజరయ్యేందుకు ఆర్థిక సహాయం అందించారు. క్రీడాకారులకు ప్రభుత్వం చేయూతనందించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. వేగూరు గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రామంలో కనీస వసతులు కూడా లోపించాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, వేగూరు సుబ్బానాయుడు, కరేటి అమరావతి, దాసరి మురళీమోహన్ పాల్గొన్నారు.

## రేపు ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**పొదలకూరు, ఫిబ్రవరి 23:** పట్టణంలోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో జరగనున్న ఆదివారం జరుగనున్న నెల్లూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు మెంటా వీరబ్రహ్మం గుప్తా కోరారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ నేతలు వెంకటశేషయ్య, చిన్ని రామసత్యనారాయణ, జయంతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రమాణ స్వీకార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అమర్తలూరు చెంచయ్య, చిట్లూరు వెంకటసుబ్రహ్మణ్యం, రాజా సురేంద్రబాబు పాల్గొన్నారు.

## టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

**సైదాపురం, ఫిబ్రవరి 23:** సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేపట్టిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేపట్టలేదని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం సైదాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఏర్పాటు చేసిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. తూర్పుపూండ్ల గ్రామంలో బెల్లంకొండ మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, వరిగొండ సురేంద్ర, రమేష్ బాబు, సరుపూరు జనార్ధన్‌నాయుడు, పచ్చా సిద్దయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని వినియోగించుకోండి

**ఇందుకూరుపేట, ఫిబ్రవరి 23 :** మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మార్చి 3, 4, 5 తేదీల్లో జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడుతో కలసి చేపలు, రొయ్యల చెరువులు, ఇటుకరాయి బట్టీలు దగ్గర నివాసం ఉంటున్న కుటుంబాలను పరిశీలించారు. ఆయా కుటుంబాల్లో 5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీనిపై ఈనెల 26వ తేదీన ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్ఎంలు కల్పవల్లి, సుశీలమ్మ, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 23:** సర్కిల్ పరిధిలో ఎక్కడైనా సరే అక్రమ ఇసుక రవాణా, తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ యశోధరాదేవి హెచ్చరించారు. శుక్రవారం ఆమె బుచ్చి టోల్ గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. రాష్ట్రేతర మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘాతో నిత్యం వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.



బుచ్చి టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సెబ్ సీఐ యశోధరాదేవి

# దెయ్యాలుంటే చూపించండి.. పట్టుకుంటాం

● చైతన్యం చేసిన జన విజ్ఞాన వేదిక

**మనుబోలు, ఫిబ్రవరి 23:** దెయ్యాలు ఉంటే చూపించండి. పట్టుకొని పోతామంటూ జనవిజ్ఞాన వేదిక సవాల్ విసిరింది. గురువారం రాత్రి మడమనురులో మూఢనమ్మకాలపై జనాలను చైతన్యం చేశారు. గత కొద్దిరోజులుగా మడమనూరు హైస్కూల్ సమీపంలో దెయ్యం తిరుగుతోందని సోషల్‌మీడియాలో ప్రచారం చేయడం విచారకరం అన్నారు. గ్రామంలో పర్యటించి ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలు, అపోహలను నివృతి చేశారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు శ్రీనానాయక్, కాలేషా, రఫీ, జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ఉదయ భాస్కర్, ఎం రాము, కళాబృందం సభ్యులు టీ పార్వతీశం, ఎ విజయకుమార్, కృష్ణారావు, సీపీఎం నాయకులు బీసీ భాస్కర్, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

## రాజరాజేశ్వరికి ఊంజల్‌సేవ

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 :** మాఘ పౌర్ణమి, లలితా జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగాయి. రాహుకాల పూజలకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం ప్రత్యేక పుష్పాలంకారం, ఊంజల్‌సేవ, సామూహిక లలితా పారాయణం, సౌందర్య లహరి పారాయణం జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జే వెంకట సుబ్బయ్య పర్యవేక్షించారు.





## హనుమంతుడిపై ఆదికేశవుడు

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 :** నగరంలోని నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం 3వరోజుకి చేరాయి. ఉదయం పూజలు, వేదపారాయణం, హోమాలు జరిగాయి. రాత్రి హనుమంత వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ స్వామి ఉత్సవం జరిగింది. వ్యవస్థాపక ధర్మకర్త రామకృష్ణమాచార్యులు పర్యవేక్షించారు.

## నేడు వేదగిరీశుడి నగరోత్సవం: డీసీఎంఎస్ చైర్మన్

**నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 23 :** వ్యాస పూర్ణిమ సందర్భంగా శనివారం వేదగిరి లక్ష్మీనరసింహస్వామి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఐదేళ్లుగా ఏటా వ్యాసపూర్ణిమ నగరోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నగరంలోని డీసీఎంఎస్ రైస్‌మిల్లులో స్వామి వారికి స్నపన తిరుమంజనము, సాయంత్రం 6.30 గంటలకు నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా గోడపత్రికలను విడుదల చేశారు. వేదగిరి క్షేత్రం ఈవో గిరికృష్ణ, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న చలపతిరావు

## వీపీఆర్‌తో బీజేపీ నేతల భేటీ

**నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 23 :** బీజేపీ ముఖ్యనేతలు శుక్రవారం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి మధుకర్‌జీ, రాష్ట్ర సెల్స్ ప్రభారి సురేంద్రరెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు.



వీపీఆర్‌తో భేటీ అయిన బీజేపీ నేతలు

## 160 సీట్లతో అధికారంలోకి టీడీపీ : కోటంరెడ్డి

**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 23 :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 160 సీట్లతో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో 34వ డివిజన్‌కు చెందిన చెరుకూరు బద్రి మిత్రబృందాన్ని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీకి 57 శాతం ఓట్లు లభిస్తాయన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జెన్ని రమణయ్య, మన్నెం పెంచలయ్య, సాబీర్‌ఖాన్, మురళి, మస్తాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, 29వ డివిజన్ వీఎంఆర్ నగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, రామచంద్రారెడ్డి నగర్ ప్రాంతాల్లో శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సుజిత, హైందవి, వైష్ణవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



బద్రి బృందాన్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీధర్‌రెడ్డి

## ఇసుక అక్రమాలు

# కలెక్టర్లకు కనిపించపోవడం సిగ్గుచేటు

**నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 23 :** రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలు ఆధారాలతో కోర్టుకు నివేదిక ఇస్తే ఈ అక్రమాలు జిల్లా కలెక్టర్లకు మాత్రం కనిపించకపోవడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 52వ డివిజన్‌లో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. నారాయణను గెలిపించుకుందామంటూ ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కో ఇసుక రీచ్‌లో రోజుకు వెయ్యి నుంచి 2 వేల టన్నుల ఇసుకను చేతితో రాసిన వేబిల్లులతో తరలిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులకు అక్రమాలు కనిపిస్తుంటే కలెక్టర్లకు మాత్రం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి ఇసుకలో దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. అయితే ప్రజలకు అన్నీ తెలుసని, టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు బొక్కిన ఇసుకనంతా కక్కిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్, యస్రబ్, రియాజ్, పాషా మొహిద్దీన్, అఫ్జల్, సుధీర్, రియాఖత్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న అజీజ్

## నారాయణ సేవలను గుర్తించండి : రమాదేవి

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 23 :** మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, ఆయన సేవలను గుర్తించాలని నారాయణ సతీమణి రమాదేవి కోరారు. శుక్రవారం 39వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మైనార్టీలను అన్ని విధాలా ఆదుకుంది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. దుల్హన్ పథకంలో రూ.లక్ష ఇచ్చే వారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దుచేసి మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. నారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపాక అనూరాధ, అన్నంగి ప్రసాద్, సుజనా, గోపిక, పిట్ల సాయి, పావనిరెడ్డి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రమాదేవి

## 'డీకేడబ్ల్యూ'లో సంగీతం సర్టిఫికెట్ కోర్స్

**నెల్లూరు (విద్య) :** డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంగీతం సర్టిఫికెట్ కోర్సు అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రిన్సిపాల్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని మహిళలు, సంగీతంపై ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 91823 23406, 8978154116 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## సంగీతా మొబైల్స్ అధినేత నారాయణరెడ్డికి కనకాభిషేకం

**బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):** దేశవ్యాప్తంగా మొబైల్స్ రిటైల్ రంగంలో రాణిస్తున్న సంగీతా మొబైల్స్ సంస్థ వ్యవస్థాపకుడు నారాయణరెడ్డికి బెంగళూరులో కనకాభిషేకం అట్టహాసంగా జరిగింది. గురువారం ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని ఉత్సవ రిసార్ట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. నారాయణరెడ్డిని బంధువులు, వ్యాపారవేత్తలు సత్కరించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ బంధుమిత్రులు, ప్రముఖుల ఆదరణ సంతోషం కలిగించిందన్నారు. కాగా, నారాయణ రెడ్డి ముని మనవడు, సంగీతా మొబైల్స్ ఎండీ సుభాష్‌చంద్ర వారసుడు డైరెక్టర్ చందు కుమారుడికి రాణా అని నామకరణం చేశారు. కార్యక్రమంలో ఎండీ సుభాష్ చంద్ర కుటుంబ సభ్యులు, ఆయన వియ్యంకుడు నందనా గ్రూప్ హోటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ రవిచందర్, ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల చైర్మన్ రమేష్‌రాజు, అడయార్ ఆనంద భవన్ స్వీట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ విష్ణుశంకర్ పాల్గొన్నారు.



నారాయణరెడ్డిని సత్కరిస్తున్న బంధుమిత్రులు

## నేడు జంగమ సంఘం సమావేశం

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 :** తోటపల్లి గూడూరు మండలం వరిగొండలో గల జ్వాలాముఖి ఆలయ ప్రాంగణంలో శనివారం జిల్లా జంగమ సంఘం సర్వసభ్య సమావేశం, వనభోజనాలు జరుగుతాయని ఆ సంఘం అధ్యక్షుడు గందవళ్ల దశరథరామయ్య తెలిపారు. శుక్రవారం మూలాపేటలోని జంగమ కల్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జంగమ కుటుంబాలను ఐక్యం చేయడం కోసం ఈ సమావేశాలు, వనభోజనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజయదుర్గా ఆస్థాన పీఠాధిపతులు పత్రి వీరబ్రహ్మయ్య స్వామి విచ్చేస్తున్నారని, ఉదయం నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన జరుగుతాయన్నారు.

## పాఠ్యపుస్తకాలు ఇవ్వకనే పరీక్షలకు...

**నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 23 :** పాఠ్యపుస్తకాలు లేకుండానే ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం శ్రీహర్ష ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తీసుకురావడమే తమ లక్ష్యమని అసత్య ప్రచారాలు చేస్తూ కాలయాపన చేసిందని విమర్శించారు. పరీక్షలు దగ్గరపడుతుండటంతో అధికారులు స్పందించి కనీసం ఉచిత స్టడీ మెటీరియల్ అయినా అందించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు.

## అపార్ట్‌మెంట్లలో ఇంటర్ పరీక్షలు ఆపాలి

ఒకే ప్రాంతంలో, డిగ్రీ కళాశాలల్లో, అపార్ట్‌మెంట్లలో ఇంటర్ పరీక్షలు నిర్వహించకుండా ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నరహరి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గాలి, వెలుతురు, కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అట్రాసిటీ కమిటీ సభ్యుడిగా మురళీకృష్ణ

**నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 23 :** జిల్లా అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్ ఎంపికయ్యారని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ ఆదిత్యసాయి తెలిపారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మురళీకృష్ణ పదేళ్లుగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా అట్రాసిటీ కమిటీ సభ్యుడిగా నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు పీ లీలామోహన్, ఎస్కే కరిముల్లా, అర్జున బాలకృష్ణ, హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 23 :** నగరంలోని రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జేమ్స్ గార్డెన్, బాలాజీనగర్, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 1 గంట వరకు, ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. పుల్లమ్మ సత్రం, కుసుమ హరిజనవాడ, నజీర్ తోట, నవాబ్‌పేట, గాండ్ల వీధి, రాజావీధి, చాముండీవారి తోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## కాకుపల్లిలో 'సురక్ష' శిబిరం

**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 23 :** ఆరోగ్య సురక్ష పథకం ద్వారా రోగులకు ఉచితంగా మందులు చేస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకుపల్లిలో సర్పంచ్ కోసూరు సుభాషిణి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని వ్యాధిగ్రస్తులకు ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులు అందచేస్తామన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ప్రధాన ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లీపురం పీహెచ్‌సీ వైద్యుడు హజరత్‌రెడ్డి, నాయకులు కోసూరు కేశవులు, వేణు(బాబీ) పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష

**సైదాపురం :** స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో పురుషోత్తం శివకుమార్, వైద్య సిబ్బంది, కార్యదర్శి శశిఇంద్రాణి, సర్పంచు శారద, ఎంపీటీసీ పద్మమ్మ, ఉపసర్పంచు బొలిగర్ల శివకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## వెటర్నరీ వర్సిటీకి న్యాక్ గుర్తింపు

### దేశంలోనే తొలి న్యాక్ పశువైద్య వర్సిటీగా గుర్తింపు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 23: తిరుపతి కేంద్రంగా నడిచే శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి తొలిసారిగా న్యాక్ గుర్తింపు లభించింది. దేశంలోని పశువైద్య విశ్వవిద్యాలయాల్లో న్యాక్ గుర్తింపు కలిగిన వర్సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడ్రోజుల పాటు చైర్మన్ డాక్టర్ సతీష్‌కుమార్ భండారీ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల న్యాక్ పీర్ రివ్యూ టీం వర్సిటీలో పర్యటించి అనుబంధ కళాశాలలను తనిఖీ చేసి ఐదేళ్ల కాలానికి(2022-2027వరకు) న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ గుర్తింపునిచ్చారు. ఇప్పటికే వర్సిటీకి 2027 మార్చి31 వరకు ఐదేళ్ల కాలానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్), వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) గుర్తింపుతో పాటు యూజీసీ 12బీ గుర్తింపు కూడా కలిగి ఉంది. కొత్తగా వర్సిటీ సిగలో న్యాక్ గుర్తింపు చేరడం పట్ల వర్సిటీ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు సంతోషం వ్యక్త పరుస్తున్నారు. న్యాక్‌కి సంబంధించి సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్ ఛైర్మన్‌గా వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, కన్వీనర్‌గా ప్రస్తుత అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య వ్యవహరించగా ఐక్యూ ఏసీ(ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్)ఇన్‌చార్జ్‌గా డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య వ్యవహరించారు. ఈ గుర్తింపు వల్ల వర్సిటీకి రీసెర్చ్ ప్రాజెక్టులతోపాటు యూజీసీ నుంచి నిధులు తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందని అధికారవర్గాలు అంటున్నాయి. ఈ గుర్తింపుకు కృషి చేసిన ఏడీ జగపతి రామయ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బందిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి, డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య అభినందించారు.



తుంబూరులో మాట్లాడుతున్న భువనేశ్వరి

## ఈ ఎన్నికల్లో అభివృద్ధిని

# గెలిపించండి

**వైసీపీ అరాచకాన్ని తిప్పికొట్టండి**

**ప్రజలకు భువనేశ్వరి పిలుపు**

**చివరి రోజు ముగ్గురికి పరామర్శ**

నారాయణవనం/సత్యవేడు/చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23: 'చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ఏ విధంగా పరుగులు పెట్టిందో మనమంతా చూశాం. ఈ ఐదేళ్లలో ఎలాంటి అరాచకాలు జరుగుతున్నాయో కూడా మనం చూస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైన దాడులు జరుగుతున్నాయి. చంద్రబాబునాయుడుపైనా అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారు. రానున్న ఎన్నికలు అరాచకానికి.. అభివృద్ధికి మధ్య జరిగేవి. ప్రజలందరూ టీడీపీ వైపు నిలబడి అభివృద్ధిని గెలిపించాలి' అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం ఆమె చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులో మోహన్‌నాయుడు.. శ్రీరంగరాజపురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో కరణం ఆంజనేయులు నాయుడు.. తిరుపతి జిల్లా నారాయణవనం మండలం తుంబూరులో మునివేలు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. తుంబూరు, ముత్తుకూరులో ఆమె మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందన్నారు. అందులో భాగంగా ప్రజలను భయపెట్టి ఇళ్లకు పరిమితం చేసి రిగ్గింగ్ చేసుకోవాలని చూస్తోందన్నారు. వీటిని అందరూ తిప్పి కొట్టాలని ఆమె కోరారు. చంద్రబాబును అక్రమంగా జైలు పెట్టినప్పుడు మహిళలు ముందుకొచ్చి అండగా నిలిచారన్నారు. ఇంటిపట్టునే ఉండే మహిళలూ బయటకు పోరాడారని గుర్తుచేశారు. టీడీపీ పాలనలో మహిళలకు రక్షణ ఉండేదని.. ఇప్పుడా పరిస్థితి ఉందా అని అడగారు. 'లేదు.. లేదు' అంటూ మహిళలు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో యువతకు గంజాయి అలవాటు చేసిందని ఈ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. ఆ మత్తులో మహిళలపై అఘాయిత్యాలు చేస్తున్నారని తెలిపారు. మహిళల కోసం చంద్రబాబు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని.. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారని వివరించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఆమె ప్రస్తావించారు. 'నేనిలా ముందుకు వచ్చానంటే.. ఈ ధైర్యం మీరిచ్చిందే' అంటూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. కాగా, పుత్తూరు బైపాస్ రోడ్డులో సత్యవేడు వైసీపీ తిరుగుబాటు ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు, జడ్పీటీసీ సుమన్‌కుమార్, కుటుంబ సభ్యులతో కలిసి భువనేశ్వరికి పసుపు, కుంకుమ, చీరను సారెగా అందించారు.

### నేనున్నానని భరోసానిస్తూ..

**● ముగిసిన భువనేశ్వరి పర్యటన ● 15 కుటుంబాలకు పరామర్శ**

చిత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అరెస్టుతో మనస్తాపంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి ఓదార్చారు. తానున్నానంటూ భరోసానిచ్చారు. ఆమె నాలుగు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. సాయంత్రం ఆమె రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ నాలుగు రోజుల్లో చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 14 కుటుంబాలు, తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో ఒక కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాలు భువనేశ్వరిని చూసి కన్నీరు మున్నీరు పెట్టుకోగా.. ఆమె ఓదార్చారు. బంగారుపాళ్యం మండలం టేకుమందలో వైసీపీ దాడిలో రెండు కళ్లను కోల్పోయిన హంసవేణిని పరామర్శించి, దివ్యాంగుడైన ఆమె కుమారుడి చదువు బాధ్యతను తీసుకుంటానని హామీనిచ్చారు. అన్నిచోట్లా భువనేశ్వరిని చూసేందుకు, సంఘీభావం తెలిపేందుకు పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, మహిళలు, స్థానికులు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. మార్గమధ్యంలో జనాన్ని చూసి కారు దిగి పలకరించారు. ఆమె పర్యటన ఆయా నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలను ఉత్సాహ పరిచింది.

### అండగా ఉంటాం



తుంబూరులో టీడీపీ కార్యకర్త మునివేలు చిత్రపటానికి నివాళులర్పించిన భువనేశ్వరి, అతడి తల్లిదండ్రులను పరామర్శించారు. ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ చిత్తూరు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు పులివర్తి నాని, నరసింహ యాదవ్, డాక్టర్ హెలెన్, జేడీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

- నారాయణవనం

### పిల్లల చదువు బాధ్యత మాదే



చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులోని మోహన్‌నాయుడు ఇద్దరి పిల్లల చదువు బాధ్యతను భువనేశ్వరి తీసుకున్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పులివర్తి నాని, చంద్రప్రకాష్, కటారి హేమలత, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు రూరల్

### అధైర్యపడొద్దు



శ్రీరంగరాజపురం మండలం గంగమ్మగుడి గ్రామంలోని కరణం ఆంజనేయులునాయుడు(68) కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. అధైర్యపడొద్దంటూ.. అండగా ఉంటామంటూ మృతుడి భార్య, ఇద్దరు కుమారులకు ధైర్యం చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ వీఎం థామస్, పరిశీలకుడు రవిప్రకాశ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ, నాయకులు పాల్గొన్నారు.

- శ్రీరంగరాజపురం



సారె సామగ్రి తీసుకొస్తున్న కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆదిమూలం

## జనమేరి జహాపనా..?







**● పట్టాలిచ్చినా...పత్తాలేరే..! ● 'కరుణ' కృతజ్ఞతా సభకు ఝలక్ ఇచ్చిన టీటీడీ ఉద్యోగులు**

'ఐదు వేలమందికి పైగా ఇంటి పట్టాలిచ్చాం, రెండువేలమంది అటవీకార్మికులకు వేతనాలు పెంచాం. ఉద్యోగులు అడిగినవన్నీ తీర్చేస్తామన్న హామీలు ఇచ్చాం' అనుకుని రాబోయే ఎన్నికల్లో టీటీడీ ఉద్యోగుల ఓట్లు గంపగుత్తగా మన ఖాతాలోనే పడిపోతాయని లెక్కలు వేసుకున్నారు. పలు దశల్లో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని పలువురు ఉద్యోగ సంఘ నాయకులు 'అహో.. రాజ, ఒహో భోజ' అన్నట్టు కీర్తించారు. అయితే టీటీడీ ఉద్యోగులంతా మనవైపే ఉన్నారనుకున్న ధీమా శుక్రవారం టీటీడీ పరిపాలన భవనం వెనుక పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన భూమన ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగిన తీరుతో వైసీపీ నేతల్లో ఒక్కసారిగా సన్నగిల్లిపోయింది.కరుణాకర రెడ్డికి ఉద్యోగులే ఏర్పాటు చేసిన ఈ కృతజ్ఞతాభినందన సభ వెలవెలబోయింది. కార్యక్రమం సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుందని చెప్పి, మీడియాకు కవరేజీ కోసం కబురు పెట్టారు. ఉదయం నుంచి వేదిక ఏర్పాట్లు చేశారు. సీఎం సభ తరహాలో పెద్దఎత్తున గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం అయిదున్నర దాకా ఉద్యోగులు ఆశించిన సంఖ్యలో రానేలేదు.సభా ప్రాంగణాన్ని నింపేందుకు ఉద్యోగ సంఘ నాయకులు నానా తంటాలు పడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.ఆరు వరుసల గ్యాలరీలను ఏర్పాటు చేస్తే, రెండు వరుసల గ్యాలరీకే ఉద్యోగులు పరిమితమయ్యారు. అందులో కూడా అటవీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందే ఎక్కువగా కనిపించారు. కుర్చీలన్నీ ఖాళీగా కనిపిస్తే బాగుండదని, వేసిన కుర్చీలను మడతపెట్టి పడుకోబెట్టేశారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కరుణాకర రెడ్డి వేదికవద్దకు చేరుకున్నారు.కార్యక్రమం యథాప్రకారం పొగడ్తలతో సాగింది.ప్లాట్లు ఇచ్చినా ఎందుకు రాలేదనే చర్చ గ్యాలరీల్లో సాగింది.దాదాపు రూ.9లక్షలు వెచ్చించి ఎక్కడో సుదూరంగా ప్లాట్లు తీసుకోవడం వలన పెద్దగా ఒరిగేదేమీలేదన్న అభిప్రాయం ఉద్యోగుల్లో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఈ అసంతృప్తితోనే ఉద్యోగులు అనాసక్తంగా ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

### వెబ్‌సైట్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 23: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల విద్యార్థులు బీఐఈఏపీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రత్యేకించి హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని పేర్కొన్నారు.

**నేడు ఇంటర్ పరీక్షలపై సమావేశం** : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలపై సమావేశం ఉంటుందని, సీఎస్‌లు, డీవోలు, అడిషనల్ సీఎస్‌లు, కస్టోడియన్లు తప్పక హాజరు కావాలని ఆర్ఐవో కోరారు. జిల్లాలో 87 కేంద్రాల్లో వచ్చేనెల 1 నుంచి నిర్వహించే ఈ పరీక్షలకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## అన్నార్తులే మోతగాళ్లు...?

**● అన్నదాన కేంద్రంలో పనిచేయని లిఫ్టు ● భక్తుల చేతే మోయించిన వేడి పాత్రలు**
**● నిద్రావస్థలో ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ వ్యవస్థ**



వంటశాల నుంచి భోజన పాత్రలను మోసుకెళ్తున్న భక్తులు



పనిచేయని లిఫ్ట్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్నార్తులైన భక్తులే మోతగాళ్లుగా మారారు.ఆలయంలోని నిత్యాన్నదాన మండపంలో భోంచేయడం ఈశ్వర ప్రసాదాన్ని స్వీకరించడంగా భక్తులు భావిస్తుంటారు.ఇక్కడ రోజుకు సుమారు 5000మంది భక్తులకు అన్న ప్రసాదం సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. కింద సెల్లార్ లోని వంటశాలలో వంటకాలను సిద్ధం చేస్తారు.వంట గదిలో నుంచి వాటిని మొదటి అంతస్తుకు లిఫ్ట్ ద్వారా తరలించాలి. సుమారుగా 200 సార్లు వేడివేడి వంటకాలను పాత్రలతో పైకి చేర్చాలి. అలాగే ఖాళీ అయిన పాత్రలను కిందకు తరలించుకోవాలి. అసలే అన్నదాన సత్రంలో సిబ్బంది కొరత ఉంది. దానికి తోడు మూడు నెలల నుంచి లిఫ్టు తరచూ మొరాయిస్తూనే ఉంది. వారం రోజుల నుంచి గోడల నుంచి లీకేజీల సమస్యతో లిఫ్ట్ పూర్తిగా పనిచేయడంలేదు.అప్పటినుంచి అన్నదాన సిబ్బందిపై వేడి పాత్రలు తరలించే అదనపు భారం పడింది. భక్తుల రద్దీ సమయంలో త్వరితగతిన పాత్రలను మొదటి అంతస్తుకు చేర్చాల్సి ఉంటుంది. దాంతో సిబ్బంది అన్నార్తులుగా వచ్చిన భక్తులనే సాయం పట్టండంటూ ప్రాధేయ పడాల్సి వస్తోంది. భారీ వేడి పాత్రలను భక్తుల సహాయంతో మొదటి అంతస్తుకు తీసుకెళుతున్నారు.

**అదుపు తప్పితే ఎంత అప్రతిష్ట...?**

వంట పాత్రలు బరువుతోపాటు వేడిగా కూడా ఉంటాయి. వాటిని భక్తులు మెట్ల మార్గంలో తీసుకెళ్లడం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది.పాత్రలు అదుపుతప్పి పొరపాటున భక్తులపై పడితే శరీరం తీవ్రంగా గాయపడే ప్రమాదం వుంది. ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన భక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తు గాయపడితే ఎంతటి అప్రతిష్టను మూట కట్టుకోవాల్సి వస్తుందో అర్థం కాని పరిస్థితి. ఆలయంలో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ వ్యవస్థ ఉంది. అయినా చిన్న లిఫ్ట్ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఆదాయం చేకూరే పనుల్లో తప్ప ఇటువంటి వాటిపై ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ చూపరని ఆలయ ఉద్యోగులే బాహాటంగా విమర్శిస్తున్నారు.

## తిరుపతిలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం

**● బోర్డు ప్రతిపాదనను ఆమోదించిన ప్రభుత్వం**

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం తిరుపతిలో ఏర్పాటు కానుంది. ఇప్పటి వరకూ ప్రాంతీయ కార్యాలయం మాత్రమే వున్న తిరుపతిలో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు బోర్డు చేసిన ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, కర్నూలు నగరాల్లో జోనల్ కార్యాలయాలున్నాయి. కర్నూలు జోనల్ కార్యాలయ పరిధిలో మొత్తం రాయలసీమ ప్రాంతం కవర్ అవుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో నెల్లూరు జిల్లా పరిధిలోని పరిశ్రమల్లో 65 శాతం పరిశ్రమలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరాయి. దానివల్ల అత్తివరం, మేనకూరు సెజ్‌లు కూడా తిరుపతి పరిధిలోకి వచ్చాయి. రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలు, నగరిలోని డైయింగ్ యూనిట్లు, ఫ్రూట్ క్యానింగ్ యూనిట్లు, శ్రీసిటీ సెజ్, డీటీజెడ్ తదితరాలన్నీ మునుపే తిరుపతి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వున్నాయి. కొత్తగా నెల్లూరు జిల్లా నుంచీ వచ్చి చేరిన పరిశ్రమల కారణంగా తిరుపతి జిల్లాలోకి 17 రకాల ప్రమాదకరమైన పరిశ్రమలన్నీ చేరినట్టయింది. వీటిని 450 కిలోమీటర్ల దూరాన వున్న కర్నూలు నుంచీ తరచూ రాకపోకలు సాగించి పర్యవేక్షించడం కష్టసాధ్యమని గుర్తించిన ఏపీ పొల్యూషన్ బోర్డు తిరుపతిలో కొత్తగా జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయడమే ఉత్తమమని భావించింది. ఆ మేరకు బోర్డు పాలకమండలి సమావేశంలో ప్రతిపాదనను ఆమోదించి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. కొత్తగా భవన నిర్మాణం వంటివేవీ అవసరం లేదని, ఇప్పటికే తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయం కోసం 25 సెంట్ల స్థలంలో రెండు సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదంతస్తుల భవనం కొత్తగా నిర్మించినందున ఆ భవనంలోనే జోనల్ కార్యాలయం కూడా నిర్వహించుకునే వీలుందని ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కొత్తగా పోస్టులేవీ మంజూరు చేయకుండా వున్న సిబ్బందితోనే సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తూ తిరుపతి కేంద్రంగా జోనల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తిరుపతిలో త్వరలో జోనల్ కార్యాలయం ఏర్పాటు కానుంది.



బాధితుడు షారుఖ్

### రేషన్‌కార్డు అడిగితే దాడి చేసిన వలంటీరు

చిట్టమూరు, ఫిబ్రవరి 23: తాను దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డు ఏమైందని అడిగినందుకు వలంటీరు, అతడి సోదరులు విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచిన ఉదంతమిది. గాయపడ్డ ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయిస్తే అతడినే తప్పుబడుతూ భయపెట్టి సర్దుబాటు చేసి పంపిన ఈ ఘటన చిట్టమూరు మండలం తాడిమేడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... తాడిమేడుకు చెందిన షారూఖ్ ఆరునెలల క్రితం రేషన్‌కార్డు కావాలని సుమత్ అనే వలంటీరును అడిగాడు. రేషన్‌కార్డు లాగిన్ ప్రభుత్వం ఇంకా వదలలేదని రేషన్‌కార్డు ఇచ్చే సమయంలో తానే దరఖాస్తు చేస్తానని వలంటీరు చెప్పాడు. గురువారం రాత్రి ఇదే విషయమై షారుఖ్ వలంటీరును అడిగాడు. తనకు సంబంధం లేదని సచివాలయం వద్ద వెళ్లి అడగమని వలంటీరు సుమత్ చెప్పాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో వలంటీరుతో పాటు అతడి సోదరులు ముగ్గురు షారూఖ్‌పై దాడిచేశారు. దీంతో షారూఖ్ తలపై బలమైన గాయమైంది. రక్తగాయాలతో షారూఖ్ చిట్టమూరు పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు బాధితుడిని భయపెట్టి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి పంపినట్లు బాధితుడు తెలిపాడు. ఎస్ఐ చిన్నబలరామయ్యను వివరణ కోరగా షారూఖ్‌దే తప్పని, అందుకే సర్దుబాటు చేసి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

# జనరంజక పాలకుడు జన్నత్‌హుస్సేన్



1985లో నిరాహారదీక్ష శిబిరం వద్ద కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నిమ్మరసం అందిస్తున్న కలెక్టర్ జన్నత్ హుస్సేన్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23: కలెక్టర్‌గా జన్నత్‌హుస్సేన్ అందించిన సేవలను ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన జన్నత్ హుస్సేన్ అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున సూళ్లూరు పేటలోని స్వగృహంలో కన్నుమూసిన విషయం తెలిసి ఆయనకు అశ్రునివాళులర్పించారు.జన్నత్ హుస్సేన్ పార్థివ శరీరాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆయన అంత్యక్రియలు పంజగుట్టలో శనివారం జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.కాగా 1985-87మధ్య నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన హోదాను పక్కనపెట్టి తన వద్దకు ఎవరు వచ్చినా లేచి నిలబడి అర్జీలు తీసుకునేవారు.ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కరించేవారు.అధికారులను ఓ మిత్రుడిగా ప్రోత్సహించేవారు. నెల్లూరు నగరంలో ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేశారు. జన్నత్ హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్ ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. పేదలకు గృహ నిర్మాణాలలో నెల్లూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఆయనకు ప్రభుత్వం అవార్డు, నగదు పురస్కారం అందజేయగా ఆ నగదును కూడా హౌసింగ్ శాఖ సిబ్బందికే పంచిపెట్టారు.కొత్తూరులో నిరుద్యోగులకు ఇచ్చిన కోళ్ల ఫారంలో కోళ్లు గంబోరా వ్యాధితో చనిపోయి తీవ్రంగా నష్టపోయారు. కలెక్టర్ హోదాలో జన్నత్ స్వయంగా కోళ్లఫారాలను సందర్శించి నిర్వాహకులకు ధైర్యం చెప్పారు. పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను స్వయంగా పరిశీలించడమేకాక విద్యార్థులకు దుస్తులు పంచేవారు. ఆయన బదిలీ అయినప్పుడు ఏ కలెక్టర్ చేయని విధంగా జిల్లాలోని 46 మండలాలకు వెళ్లి అక్కడి అధికారులను, సిబ్బందిని పలకరించి వీడ్కోలు తీసుకున్న సంఘటనలను పలువురు విశ్రాంత అధికారులు గుర్తు చేసుకుంటున్నారు.

### ఎమ్మెల్యే కోటంరెడ్డి నివాళి

జన్నత్ హుస్సేన్ మరణంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో వీఆర్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా 13రోజులు నిరాహార దీక్ష చేసినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆదేశాల మేరకు జన్నత్‌హుస్సేన్ కలెక్టర్ హోదాలో దీక్షా శిబిరం వద్దకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, తనకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారని తెలిపారు. అప్పట్లో డీసీసీబీకి జరిగిన ఎన్నికల్లో గుమస్తా గిరి నుంచి కలెక్టర్ వరకు అన్నీ తానై సమర్థవంతంగా నిర్వహించి రైతుల మన్నలు పొందారన్నారు.

## వైసీపీని గద్దెదించాలి: పాశం



ప్రచారం నిర్వహిస్తున్న పాశం సునీల్‌కుమార్, టీడీపీ నేతలు

చిల్లకూరు, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏరూరు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి మరచి అరాచకపాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఒక్క చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగయువత, విద్యార్థుల సంక్షేమం కోసం చంద్రబాబు మినీ మెనిఫెస్టోను విడుదల చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యవసరాల ధరలు, విద్యుత్, బస్సు చార్జీలు పెరిగిపోవడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావవతి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, భాస్కర్‌రెడ్డి, మూగా శంకరయ్య, సుప్రజ, కీరవాణి, మునిశేఖర్‌గౌడ్, వెంకటేశ్వర్లునాయుడు, కుమార్‌యాదవ్, శైలజ, నరసింహులు తదిరులు పాల్గొన్నారు.

## పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలి




ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 23: పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం నాయకుడు జోగి శివకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిరసన తెలిపామన్నారు. పంజాబ్ రాష్ట్రంలో పోలీసుల కాల్పులలో యువరైతు శుభకరణ్‌సింగ్ చనిపోవడం బాధాకరమని, ఇందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పిస్తామని, కేసులు ఎత్తివేస్తామని ఇచ్చిన హామీలను ఉల్లంఘించిందని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీవీ రమణయ్య, సురేష్, వెంట్రామిరెడ్డి, ప్రసాద్, రమేష్, కోటేశ్వరరావు, చంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరు దారుణం: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని సీపీఐ నాయకుడు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను తీవ్రవాదులుగా భావిస్తూ దాడులకు పాల్పడడం దారుణమన్నారు. హక్కుల సాధన కోసం శాంతియుత పోరాటం చేస్తున్న రైతులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో యువ రైతు మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేశసంపదను కార్పొరేటర్ల పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వారికి అనుకూలంగా చట్టాలను చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో శశికుమార్, నారాయణ, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

## తనయుడి గెలుపు కోసం తల్లి మంతనాలు



మధుసూదనరెడ్డితో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

బాలాయపల్లి, ఫిబ్రవరి 23: మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తనయుడు రాంకుమార్ రెడ్డి గెలుపు కోసం మండలంలోని పెద్ద కాపులతో శుక్రవారం మంతనాలు జరిపారు. మండలంలోని జయంపు గ్రామానికి చెందిన వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ వెందోటి మధుసూదనరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అదేవిధంగా పల్లిపాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బద్దెవోలు రవీంద్రరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. అలాగే నిడిగల్లు గ్రామానికి చెందిన మస్తాన్ రెడ్డి, పోలిరెడ్డితో పాటు సర్పంచు చప్పిడి గాయత్రీలను కలసి చర్చించారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్‌రెడ్డికి అండగా నిలిచి గెలిపించాలని కోరినట్లు తెలిసింది.

### నల్లపరెడ్డికి నివాళి

కోట, ఫిబ్రవరి 23: మాజీ మంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కోట పట్టణంలోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సారంగం రమేష్‌బాబు, విజయభాస్కర్, అంబరీషా, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గూడలిలో శాంతి కల్యాణం

కోట, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని గూడలిలో శుక్రవారం మాఘమాసాని పురస్కరించుకొని జనార్దనస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానఅర్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి, అమ్మవార్లతో జనార్దనస్వామికి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివార్లు గూడలి పురవీధుల్లో ఊరేగారు.

### ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీర్ కళాశాలలో శుక్రవారం ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఇనిస్పిరాన్ 2024 సాంకేతిక సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి సురేష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



### పోతురచ్చ ప్రారంభం

డక్కిలి, ఫిబ్రవరి 23: డక్కిలి మండలం మాటుమడుగు గ్రామంలో గడ్డం జంజి పరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అశోక్‌కుమార్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన పోతు రచ్చను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎస్ఈబీ దాడుల్లో ఐదుగురి అరెస్టు

వాకాడు, ఫిబ్రవరి 23: ఎస్ఈబీ దాడుల్లో ఐదుగురి అరెస్టయ్యారు. ఎస్ఈబీ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... వాకాడు మండలం సిద్దిగుంటపాళెం రొయ్యలగుంట వద్ద పేకాట ఆడుతుండగా శుక్రవారం ఎస్ఈబీ ఆధ్వర్యంలో దాడులు చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7వేలు నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే కోట మండలంలోని ఊనుగుంట పాళెం గ్రామంలో వెంకటసుబ్బయ్య అక్రమంగా పది మద్యం బాటిళ్లు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు.

### అత్యాచారయత్నంపై కేసు నమోదు

చిల్లకూరు, ఫిబ్రవరి 23: అత్యాచారయత్నం కేసులో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### దుకాణ స్థలం విషయమై పరస్పర దాడులు

గూడూరు, ఫిబ్రవరి 23: పట్టణంలోని స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద దుకాణాల నిర్వహణకు సంబంధించిన స్థలం విషయమై ఇరువురు వ్యాపారుల మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో ఇరువురు గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## దువ్వూరు పయనమెటు!

- అసమ్మతి రాగంతో పార్టీకి దూరంగా
- పనబాక టీడీపీ అభ్యర్థి అయితే..

**వైసీపీని వీడటం పక్కా అంటున్న అనుచరగణం**

తడ, ఫిబ్రవరి 23: సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతివర్గం పార్టీకి పూర్తిగా దూరం కానుందా... తమ అభిష్టానికి భిన్నంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో ఇక పార్టీతో తెగతెంపులకు సిద్ధమయ్యారా... అంటే ఔననే అంటున్నారు అసమ్మతి నేతలు. దొరవారిసత్రం మండలానికి చెందిన, చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైసీపీ పటిష్ఠానానికి మొదటి నుంచి కృషి చేశారు. 2014, 19 ఎన్నికల్లో కిలివేటి సంజీవయ్య గెలుపు కోసం ప్రధాన భూమిక పోషించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో ఆయనకు దూరం పెరిగింది. తన అనుచరగణంపై ఎమ్మెల్యేనే కేసులు బనాయించారంటూ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. వచ్చే ఎన్నికల్లో కిలివేటికి టిక్కెట్ దక్కనీవ్వకూడదని విశ్వప్రయత్నాలు చేశారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సమక్షంలో వ్యతిరేక గళం వినిపించారు. అయితే అధిష్ఠానం మరోసారి కిలివేటికి టిక్కెట్ ఖరారు చేసిందని, అందరూ కలసి కట్టుగా ఆయన విజయానికి కృషి చేయాలని, పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవంటూ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. దీంతో అసమ్మతి వర్గం రగిలిపోయింది. అప్పటి నుంచి దువ్వూరు బాలచంద్రారెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అనుచరగణం టీడీపీలోకి వెళ్లాలని ఆయనపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజులక్రితం హైదరాబాదులో ఉన్న బాలచంద్రారెడ్డిని కొందరు టీడీపీ నాయకులు సైతం కలసి చర్చలు జరిపినట్లుగా సమాచారం. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి దంపతులతో గతంలో సన్నిహిత సంబంధాలు ఉండటంతో వారు సైతం టీడీపీలోకి ఆహ్వానించినట్లుగా తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థిగా పనబాక కృష్ణయ్యను నిర్ణయిస్తే ఆ పార్టీలో చేరాలన్న నిర్ణయానికి వచ్చినట్లుగా ఆయన అనుచరులు చెబుతున్నారు. అదే జరిగితే సూళ్లూరుపేట వైసీపీకి భారీగా దెబ్బతగిలే ఆస్కారం ఉంది. ఈ పరిణామాలతో అప్రమత్తమైన ఎమ్మెల్యే కిలివేటి రెండు రోజుల క్రితం దువ్వూరును కలసి పార్టీని వీడవద్దని మంతనాలు జరిపారని, అయితే ఆయన ససేమిర అన్నట్లు చేసేదిలేక ఎమ్మెల్యే వెనుతిరిగినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, టీడీపీలోని ఒక వర్గం దువ్వూరు చేరికను వ్యతిరేకిస్తున్నట్లుగా సమాచారం.

## అరాచక పాలనకు చరమగీతం పాడాలి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 23: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని కానూరు పంచాయతీలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక కనివిని ఎరుగని రీతిలో దోపిడీ, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వం అక్రమాలను బయటపెడుతున్న మీడియా ప్రతినిధులపై దాడులు దిగడం చేయడం హేయమైన చర్య అని అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అందరం కలసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, నాయకులు దామెర ప్రసాద నాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, వెంపళ్ల వెంకటేశ్వర్లు, నెలవల ప్రసాద్, కిశోర్‌రాజు, రామచంద్రరాజు, శేఖర్‌రాజు, వెంకటేశ్వర్లు రాజు, వాకిరి వెంకటేశ్వర్లు, పరుశురామ్, ఏడుకొండలు, గుంటపూడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డిని కలిసిన వేనాటి సతీష్ రెడ్డి



వేమిరెడ్డితో వేనాటి సతీష్ రెడ్డి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డితో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వేమిరెడ్డిని కలిసిన వారిలో వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నూలేటి రమణయ్య, అశోక్ రెడ్డి, నాపా మునిరాజా, గండవరం రమేష్ రెడ్డి, మల్లికార్జున్, భాస్కర్, బుద్ధి విజయలక్ష్మి, మంజుల, ప్రమీలా, శల్లమ్మ తదితరులు ఉన్నారు.

### పాఠశాలకు బెంచీల వితరణ

కోట, ఫిబ్రవరి 23: కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీక్లబ్ అంతర్జాతీయ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు కోట రోటరీక్లబ్ తరపున రూ.70వేల విలువచేసే బెంచీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిచే జడ్పీబాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదుతో పాటు షీల్డ్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు జలీల్ అహ్మద్, మొబిన్‌బాషా, షంషూద్దీన్, తీగల సురేష్‌బాబు, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, వంశీ, హెచ్‌ఎం విజయభాస్కర్ పాల్గొన్నారు.

### చేయూత ఆశ్రమానికి బాలుడి అప్పగింత

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 23: దివ్యాంగుడైన బాలుడు అఖిల్‌ను శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీ సభ్యులు నాయుడుపేటలోని చేయూత అనాథాశ్రమం నిర్వాహకుడు తొప్పాని కృష్ణకు అప్పగించారు. రైల్లో బెంగళూరుకు వెళ్లిన అఖిల్‌ను అక్కడి పోలీసులు గుర్తించారు. బాలుడికి సరిగా మాటలు రాకపోవడంతో స్వగ్రామం నెల్లూరుగా గుర్తించి జిల్లా చైల్డ్‌వెల్‌ఫేర్ కమిటీకి అప్పగించగా, వారు అనాథాశ్రమానికి తరలించారు.

### రహదారి విస్తరణ పనులకు సహకరించండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 23: నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు జరుగుతున్న 71వ జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని తహసీల్దారు కేవీఆర్వీ ప్రసాద్‌రావు కోరారు. శుక్రవారం ఆయన చిల్లకూరులో ఇళ్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడారు. తమకు నష్టపరిహారం అందే వరకు ఇళ్లను తొలిగించేది లేదని బాధితులు తహసీల్దార్‌కు స్పష్టం చేయడంతో ఆయన వెనుతిరిగారు. ఆర్ఐ సంతోషిబాయి, సర్వేయర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దారు

### పోలింగ్ బూత్‌ల పరిశీలన

నాయుడుపేట, ఫిబ్రవరి 23: పట్టణంలోని పోలింగ్ బూత్‌లను మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, బీఎల్‌వోలు రమేష్, దుర్గాభవానీ తదితరులు ఉన్నారు.

### విద్యాసామగ్రి అందజేత

తడ, ఫిబ్రవరి 23: చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. మాజీ ఎంఈవో కటారి ఉదయకుమార్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వారి కుటుంబసభ్యులు విద్యార్థులకు అట్టలు, జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫణివేణి, ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### చెంగాళమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న చెంగయ్య దంపతులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి శుక్రవారం నాయుడుపేటకు చెందిన బత్తల చెంగయ్య, చెంగమ్మ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ప్రాకారోత్సవం

చెంగాళమ్మ ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 108 కలశాలతో ప్రాకారోత్సవం జరుగుతుందని ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. ప్రాకారోత్సవం అనంతరం క్షీరాభిషేకం, మహా చండీయాగం జరుగుతుందన్నారు.

### విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, ఫిబ్రవరి 23: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని రోటరీక్లబ్ సభ్యులు అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు దాతృత్వంతో విద్యార్థులకు క్రీడాదుస్తులు, క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మునిగిరీష్, కృష్ణయ్య, స్వరూప్‌కుమార్, ప్రసాద్, బాలకృష్ణంరాజు, హరిప్రసాద్, బాలరామిరెడ్డి, హెచ్‌ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### రుణాల రికవరీ శాతాన్ని పెంచాలి

బాలాయపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన కళాంజలి పొదుపు సంఘానికి రుణం మంజూరు చేయంలో బాలాయపల్లిలోని కెనరా బ్యాంకు అధికారులు ఆలస్యం చేస్తున్నారని పొదుపు సంఘ సభ్యులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎల్డీఎం సుభాష్ బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల సమావేశానికి హాజరై ఉన్నతి, స్త్రీ నిధి రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు.

### అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల కింద అర్హులందరికీ రుణాలు అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బ్యాంకుల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం సుధారెడ్డి, బ్యాంక్ మేనేజర్లు, వెంకటరమణ, బాబా, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జయరాజ్

పెళ్లకూరు, ఫిబ్రవరి 23: స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సర్వే అధికారి పీవీ జయరాజ్ ఆదేశించారు. భూ రీసర్వేలో భాగంగా పెళ్లకూరులో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులును ఆయన శుక్రవారం పరిశీలించారు. పెళ్లకూరు, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, జీలపాటూరు, ఊడిపూడి శెట్టిగుంట, ఆర్లపాడు, బంగారంపేట తదితర గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేశామని, మిగిలిన గ్రామాల్లో కూడా త్వరితగతిన రీసర్వే పూర్తిచేసి స్టోన్ ప్లాంటేషన్ పనులను చేపడతామని మండల సర్వేయర్ పూజిత డీఎస్ఎల్వో జయరాజ్‌కు వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఉదయ్‌కుమార్, వీఆర్వో వంశీకృష్ణ, సర్వేయర్లు సూర్యనారాయణ, లక్ష్మణ్, శ్రీను తదితరులు ఉన్నారు.

### నేత్రదానం సామాజిక బాధ్యత



నీలిశెట్టి విఠల్

గూడూరు, ఫిబ్రవరి 23: నేత్రదానం సామాజిక బాధ్యత గుర్తించాలని సునీత సేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజావీధికి చెందిన నీలిశెట్టి విఠల్ (64) మృతి చెందడంతో తమ సంస్థ అభ్యర్థన మేరకు వారి కుటుంబసభ్యులు నేత్రదానానికి సహకరించారన్నారు. నెల్లూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులచే నేత్రాలను సేకరించి వారికి అప్పగించామని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇది 13వ నేత్ర దానమని, నేత్రదానం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగునింపిన వారమవుతామని శ్రీనివాసులు అన్నారు.

### మట్టి దోపిడీ ఆపకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు

పెళ్లకూరు, ఫిబ్రవరి 23: మండలంలోని బంగారంపేట పంచాయతీ పరిధిలో చెరువుల నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఆపకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, స్థానిక సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బంగారంపేట చిన్న చెరువు, శెట్టిగుంట చెరువుల నుంచి స్థానిక వైసీపీ నేతలు భారీ యంత్రాలతో మట్టిని తవ్వి తరలిస్తుండడంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

### విద్యార్థులు సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి

నాయుడుపేట, ఫిబ్రవరి 23: విద్యార్థులు సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ మక్సూద్ అహ్మద్ అన్నారు. పెళ్లకూరు మండలం శిరసనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ నిర్వహించారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణాకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ, హెచ్‌ఎం శేషాచలం, మురళీకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, శ్రీరామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మంచినీటి సరఫరా పథకం పరిశీలన

వాకాడు, ఫిబ్రవరి 23: మండలంలోని స్వర్ణముఖినది ఒడ్డున రక్షిత మంచినీటి పథకం ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను జడ్పీ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి కన్నమ నాయుడు శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నమనాయుడు మాట్లాడుతూ వేసవి ప్రారంభం కానున్న నేపథ్యంలో తాగునీటి పథకాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ పనివిధానం పరిశీలిస్తూ, పైప్‌లైన్‌లు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్, ఎంపీడీవో గోపీనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌చౌదరి పాల్గొన్నారు.

### స్త్రీ శిశు మరణాలను తగ్గించండి

బాలాయపల్లి, ఫిబ్రవరి 23: స్త్రీశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం ఆరోగ్య శాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లివేడు గొట్టికాడులో రక్తహీనత ఉన్న పిల్లలు, గర్భిణులను గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు రక్తహీనత ఉంటే కాన్పు సమయంలో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర కుమార్, బేబీరాణి, ప్రకాశ్, వైద్యాధికారి ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

### మట్టి నమూనాలపై అవగాహన



మట్టి నమూనాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న రామాజనేయులు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 23: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో జిల్లా వ్యవసాయధికారి డాక్టర్ రామాజనేయలు విద్యార్థులకు మట్టి నమూనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు, వాటి విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పరమేశ్వరి, పుష్పాంజలి, రాజీవన, నాగార్జునా సాగర్, సుజాత, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.